TGTEL/25/A2394

# ప్రజాక్షేత్రం

ప్రతి క్షణం.. ప్రజల పక్షం

సంపుటి: 03 | సంచిక: 127 | హైదరాబాద్ | సోమవారం 26-10-2026 | పేజీలు: 08

## మారుమూల గ్రామాల సమస్యలకు శాశ్వత పరిష్కారం



- మక్తల్ నియోజకవర్గ అభివృద్ధిపై మంత్రి వాకిటి శ్రీహరి ప్రత్యేక దృష్టి
- అమరచింత మండలంలోని 14 గ్రామాలపై సమీక్ష
- సర్పంచులు, ఉపసర్పంచులతో గ్రామాలవారీగా చర్చలు
- ప్రతి గ్రామానికి అరగంట సమయం కేటాయింపు
- ప్రజల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్న మంత్రి
- భవిష్యత్ అభివృద్ధి పనులపై ప్రత్యేక కార్యాచరణ
- గ్రామాలవారీగా సమస్యలపై ప్రత్యేక నోట్ సిద్ధం
- పనుల పూర్తికి గడువు నిర్ణయించాలని ఆదేశం
- రహదారులు, తాగునీరు, పారిశుధ్యంపై దృష్టి

2



## ఉగ్రవాదాన్ని ఉపేక్షించొద్దు

- రాజకీయ ప్రయోజనాల కోసం ఉగ్రవాదాన్ని ఉపేక్షించొద్దు
- ఉగ్రవాదాన్ని ఏ రూపంలోనూ సమర్థించలేం
- టెర్రరిజం పట్ల ఏమాత్రం సహనం తగదు
- చరిత్ర పాఠాలను పక్కనపెడుతున్న కొన్ని దేశాలు
- అంతర్జాతీయ సమాజం కఠిన వైఖరి అవలంబించాలి
- ఉగ్రవాదంపై పోరుకు ప్రపంచదేశాలు ఏకం కావాలి
- ఉమ్మడిగా ఎదుర్కోవాల్సిన అంతర్జాతీయ ముప్పు
- యుద్ధాలతో ప్రపంచానికి విస్తృత ప్రతికూల ప్రభావాలు
- ఇరాన్, ఉక్రెయిన్ సంక్షోభాలకు చర్చలే పరిష్కారం

2




2

## 500కు పైగా సినిమాల రహస్య పత్రాలు లీక్?

- ఈ-సినిప్రమాణ్ పోర్టల్‌లో భద్రతా లోపాలపై ఆందోళన
- సెన్సార్ బోర్డు పత్రాలు ఇంటర్నెట్‌లో బహిర్గతమైనట్లు వార్తలు
- షూటింగ్ స్క్రిప్టులు, కట్ ఆర్డర్లు లీకైనట్లు ప్రచారం
- సినిమాల పూర్తి కథలు బయటపడినట్లు సమాచారం
- నిర్మాతల వ్యాపార ఒప్పందాలపైనా ప్రభావం పడే అవకాశం
- ఇంటర్నెట్ ఆర్కైవ్‌లో ఫైళ్లు అందుబాటులో ఉన్నాయన్న కథనాలు
- ప్రభుత్వ పోర్టళ్లలో సమాచార భద్రతపై ప్రశ్నలు
- సమగ్ర విచారణ, భద్రతా తనిఖీ చేపట్టిన సీబీఎఫ్‌సీ
- ఎలాంటి లీకేజీ జరగలేదని బోర్డు స్పష్టీకరణ

**న్యూఢిల్లీ, (ప్రజాక్షేత్రం):**

కేంద్ర ఫిలిం సెన్సార్ బోర్డు (సీబీఎఫ్‌సీ)కు చెందిన 'ఈసినిప్రమాణ్' డిజిటల్ పోర్టల్‌లో భారీ డేటా లీక్ జరిగినట్లు వచ్చిన వార్తలు సంచలనం రేపుతున్నాయి. దాదాపు 500కు పైగా సినిమాలకు సంబంధించిన సున్నితమైన పత్రాలు ఇంటర్నెట్‌లో బహిర్గతమైనట్లు ప్రచారం జరుగుతోంది. అయితే, ఎలాంటి డేటా లీకేజీ జరగలేదని సీబీఎఫ్‌సీ మిగతా 2లో..




## బీజేపీని ఎలా బలోపేతం చేద్దాం!

- తెలంగాణ బీజేపీ నేతలకు ఢిల్లీ నుంచి అత్యవసర పిలుపు
- అమిత్ షా, నితిన్ నబీన్‌తో కీలక నేతల భేటీ
- హుటాహుటిన ఢిల్లీకి బయల్దేరిన రాష్ట్ర నాయకులు
- బండి సంజయ్, కొండా విశ్వేశ్వర్ రెడ్డికి పిలుపు
- ఎన్వీ సుభాష్ సహా పలువురు నేతలు ఢిల్లీకి
- రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై ప్రధానంగా చర్చ
- పార్టీ బలోపేతంపై అధిష్ఠానం దిశానిర్దేశం
- ప్రజాందోళనలు, నిరసన కార్యక్రమాలపై సమాలోచనలు
- గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసే వ్యూహం
- రాబోయే ఎన్నికలే లక్ష్యంగా భవిష్యత్ కార్యాచరణ
- సమావేశం తర్వాత రాజకీయ కార్యకలాపాలు ముమ్మరం చేసే యోచన

**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

తెలంగాణ బీజేపీలో కీలక పరిణామం చోటుచేసుకుంది. పార్టీ అధిష్ఠానం నుంచి అత్యవసర పిలుపు రావడంతో రాష్ట్రానికి చెందిన పలువురు ముఖ్య నేతలు హుటాహుటిన ఢిల్లీకి బయల్దేరి వెళ్లారు. కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి ఎన్వీ సుభాష్ తదితరులు ఢిల్లీ వెళ్లిన వారిలో ఉన్నారు. ఆదివారం సాయంత్రం కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్‌తో వారు ప్రత్యేకంగా సమావేశం కానున్నట్లు సమాచారం. రాష్ట్రంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, పార్టీ బలోపేతానికి అనుసరించాల్సిన

# రాహుల్‌కు కాంగ్రెస్ సర్కార్ ఏటీఎం..

- రాహుల్ గాంధీకి తెలంగాణ ఒక ఏటీఎంగా మారిందన్న కేటీఆర్
- హామీలు గాలికొదిలి కాంగ్రెస్ ప్రజలను మోసం చేస్తోందని విమర్శ
- సీఎం రేవంత్ పాలనలో స్కామ్‌లు, అవినీతి పెరిగిపోయిందని ఆరోపణ
- 2028లో కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని ధీమా వ్యక్తం చేసిన కేటీఆర్
- తెలంగాణ కాంగ్రెస్‌పై కేటీఆర్ తీవ్ర విమర్శలు
- రాహుల్ మౌనం వెనుక మర్మమదే: కేటీఆర్
- కుంభకోణాలపై రాహుల్ ఎందుకు మౌనం?
- హామీలు అమలు చేయకుండా ప్రజలకు టోకరా
- రేవంత్ సర్కార్‌పై కేటీఆర్ ఘాటు వ్యాఖ్యలు
- తెలంగాణలో ఏం జరుగుతున్నా రాహుల్‌కు పట్టదా?
- వెయ్యి రోజులైనా హామీల అమలేది?
- రాహుల్ గాంధీకి తెలంగాణకు వచ్చే ధైర్యం లేదు: కేటీఆర్
- కాంగ్రెస్ అవినీతిపై రాహుల్ ఎందుకు మాట్లాడటం లేదు?



**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం రాహుల్ గాంధీకి ఒక ఏటీఎంగా మారిందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏటీఎం కార్డులా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో వరుస కుంభకోణాలు, అవినీతి జరుగుతున్నా రాహుల్ గాంధీ మౌనంగా ఉండటానికి కారణం.. ఇక్కడి నుంచి ఆయనకు ముడుపులు అందుతుండటమేనని కేటీఆర్ ధ్వజమెత్తారు. ఖైరతాబాద్ నియోజకవర్గానికి చెందిన మైనారిటీ నాయకుడు జిబ్రాన్ షరీఫ్, తెలంగాణ భవన్‌లో కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు మిగతా 2లో..

## రూ.600కే వారం రోజులు ఆర్టీసీ ప్రయాణం

- హైదరాబాద్ నగర ప్రయాణికులకు తెలంగాణ ఆర్టీసీ శుభవార్త
- ఏడు రోజుల పాటు అపరిమిత ప్రయాణానికి వీక్లీ పాస్
- గ్రేటర్ పరిధిలో అన్ని రకాల సిటీ బస్సుల్లో సౌకర్యం
- ఏసీ బస్సుల్లోనూ ప్రయాణించే అవకాశం
- పుష్పక్ విమానాశ్రయ బస్సులకు వర్తించని పాస్
- నగరంలోని అన్ని ఆర్టీసీ కౌంటర్లలో అందుబాటులో
- కొనుగోలు చేసిన రోజు నుంచే చెల్లుబాటు
- వారం రోజులు తరచూ ప్రయాణించేవారికి ప్రయోజనం
- ప్రయాణ ఖర్చులు తగ్గించడమే లక్ష్యం
- బడ్జెట్ ధరలో నగర ప్రయాణానికి వెసులుబాటు




**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

హైదరాబాద్ నగర ప్రయాణికులకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ) శుభవార్త చెప్పింది. వారం రోజుల పాటు అపరిమితంగా బస్సుల్లో ప్రయాణించేందుకు రూ.600కే వీక్లీ పాస్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఈ పాస్‌తో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఏడు రోజుల పాటు ఎన్నిసార్లయినా సిటీ బస్సుల్లో ప్రయాణించవచ్చు. నగర ప్రయాణ ఖర్చులను తగ్గించడంతోపాటు తరచూ బస్సుల్లో రాకపోకలు సాగించేవారికి ఈ పాస్ ఉపయోగపడనుంది.

**రూ.600తో ఏడు రోజుల ప్రయాణం**

హైదరాబాద్‌లో రోజూ బస్సుల్లో ప్రయాణించే వారికి ఆర్టీసీ కొత్త వీక్లీ పాస్‌ను తీసుకొచ్చింది. రూ.600 చెల్లించి ఈ పాస్ కొనుగోలు చేస్తే, ఏడు రోజుల పాటు అపరిమితంగా ప్రయాణించవచ్చు. ఉద్యోగులు, విద్యార్థులు, మిగతా 2లో..

# పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య

- మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి
- తాటిపల్లిలో రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు శంకుస్థాపన
- 25 ఎకరాల్లో ఆధునిక పాఠశాల నిర్మాణం
- సుమారు 2,600 మంది విద్యార్థులకు ప్రయోజనం
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులకు నాణ్యమైన విద్య
- ఒకే ప్రాంగణంలో విద్య, వసతుల కల్పన
- 18 నెలల్లో నిర్మాణం పూర్తి చేయాలని లక్ష్యం
- వచ్చే విద్యాసంవత్సరానికి 10 పాఠశాలల్లో తరగతులు
- విద్యారంగ మౌలిక వసతులపై ప్రభుత్వ ప్రత్యేక దృష్టి
- జిల్లాలో రూ.500 కోట్లతో విద్యాభివృద్ధి పనులు
- నీటి సంరక్షణకు రాజకీయాలకు అతీతంగా కృషి చేయాలి



**జగిత్యాల, (ప్రజాక్షేత్రం):**

పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. జగిత్యాల రూరల్ మండలం తాటిపల్లిలో రూ.200 కోట్లతో 25 ఎకరాల్లో నిర్మించనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ పనులకు ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, కలెక్టర్ బి. సత్యప్రసాద్‌తో కలిసి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల విద్యార్థులకు ఒకే ప్రాంగణంలో నాణ్యమైన విద్యతో పాటు ఆధునిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను నిర్మిస్తోందని పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఆర్థిక పరిస్థితులతో సంబంధం లేకుండా పేద విద్యార్థులు మెరుగైన విద్యను అభ్యసించేలా మిగతా 2 లో..

## సీఎంఆర్ అక్రమాలపై ఉక్కుపాదం

- ఐదుగురు మిల్లర్ల అరెస్టు చేసిన సీఐడీ
- ములుగు జిల్లాలో సీఐడీ పోలీసుల చర్యలు
- మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షుడు కూడా అదుపులోకి
- వరంగల్ సీఐడీ కార్యాలయానికి తరలింపు
- ప్రభుత్వ ధాన్యాన్ని సొంతానికి వాడుకున్నారనే ఆరోపణలు
- కోట్ల రూపాయల్లో పేరుకుపోయిన బకాయిలు
- ఎఫ్‌సీఐకి దొడ్డు బియ్యం సరఫరా చేసినట్లు గుర్తింపు
- మూడు జిల్లాల్లో 16 మిల్లులపై దర్యాప్తు
- 3,385 మెట్రిక్ టన్నులకు పైగా దొడ్డు బియ్యం సరఫరా
- బోనస్ రూపంలో ప్రభుత్వానికి రూ.1.69 కోట్ల నష్టం
- అధికారుల పాత్రపైనా సీఐడీ విచారణ



**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) ధాన్యాన్ని పక్కదారి పట్టించడం, ప్రభుత్వానికి అందించాల్సిన బియ్యం విషయంలో అక్రమాలకు పాల్పడినట్లు మిగతా 2లో..

## ఐటీ ఉద్యోగాలు కన్నడిగులకు ఇవ్వండి

- లేదంటే కంపెనీలపై కఠిన చర్యలు
- కర్ణాటక సీఎం డీకే శివకుమార్ హెచ్చరిక
- నియామకాల్లో స్థానికులను పక్కనపెడుతున్నారంటూ ఫిర్యాదులు
- కన్నడిగుల హక్కులు, గౌరవాన్ని విస్మరిస్తే సహించేది లేదని స్పష్టీకరణ
- బెంగళూరులో ఐటీ సంస్థలపై ప్రభుత్వానికి ఫిర్యాదులు
- సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా ఉద్యోగ వివక్ష ఆరోపణలు
- రెజ్యూమెలో కన్నడ భాషను పేర్కొన్నందుకు దరఖాస్తు తిరస్కరణ?
- మహిళ ఫిర్యాదుతో మరోసారి తెరపైకి వచ్చిన వివాదం
- స్థానికుల ప్రతిభ, నైపుణ్యాలపై రాష్ట్రానికి గర్వమన్న సీఎం
- ఉద్దేశపూర్వక వివక్ష నిర్ధారణైతే చర్యలు తప్పవని హెచ్చరిక



**న్యూఢిల్లీ, (ప్రజాక్షేత్రం):**

నియామక ప్రక్రియలో కన్నడిగులను ఉద్దేశపూర్వకంగా పక్కనపెడుతున్నట్లు తేలితే ప్రైవేటు సంస్థలు, ముఖ్యంగా ఐటీ కంపెనీలపై కఠిన చర్యలు తీసుకుంటామని కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ హెచ్చరించారు. స్థానికుల హక్కులు, గౌరవం, ఉద్యోగ అవకాశాలను నిర్లక్ష్యం చేయడాన్ని ప్రభుత్వం సహించబోదని స్పష్టం చేశారు. బెంగళూరులోని ఐటీ కంపెనీల్లో కన్నడిగులకు ఉద్యోగాలు నిరాకరిస్తున్నారంటూ ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో ఆయన స్పందించారు. ఈ మేరకు సామాజిక మిగతా 2లో..

# పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య

మొదటిపేజీ తరువాయి

ఈ పాఠశాలలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. వచ్చే విద్యాసంవత్సరం నాటికి కనీసం 10 పాఠశాలల్లో తరగతులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.
విద్యతో పాటు సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం సమాన ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి చెప్పారు. విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించడంతో పాటు మెరుగైన వసతులు కల్పించడమే లక్ష్యమని వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లోని పేద విద్యార్థులకు కూడా పట్టణాల్లోని కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా విద్య అందుబాటులోకి రావాలని ఆకాంక్షించారు.
ప్రస్తుతం సూపర్ ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో నీటి సంరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని పొన్నం ప్రభాకర్ అన్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు కలిసి నీటి వనరులను కాపాడుకునేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తులో నీటి కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు.
మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ తాటిపల్లిలో నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ స్కూల్ పనులను 18 నెలల్లో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్యారంగంలో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు విద్యార్థులకు మెరుగైన భోజనం, వసతులు అందించడంపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణంలో చదువుకునే అవకాశం కల్పించేందుకు అవసరమైన సదుపాయాలు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు.
కరువు పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని నీటి నిల్వలను పెంచేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని అడ్లూరి సూచించారు. నీటి వనరుల సంరక్షణకు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని అన్నారు.
ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ 25 ఎకరాల్లో నిర్మించనున్న ఈ పాఠశాల సుమారు 2,600 మంది విద్యార్థులకు ఉపయోగపడేలా ఆధునిక వసతులతో రూపుదిద్దుకోనుందని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అవసరమైన సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు.
ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మాట్లాడుతూ ఈ పాఠశాల జగిత్యాల జిల్లాలో విద్యాభివృద్ధికి దోహదపడటంతో పాటు వివిధ సామాజిక వర్గాల విద్యార్థుల మధ్య ఐక్యతను పెంపొందిస్తుందని అన్నారు. విద్యార్థులకు సమాన అవకాశాలు కల్పించడంలో ఇటువంటి పాఠశాలలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు.
కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో విద్యారంగ మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం సుమారు రూ.500 కోట్ల విలువైన పనులు కొనసాగుతున్నాయని తెలిపారు.
ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఎన్. ప్రసన్నాంబ, మున్సిపల్ చైర్‌పర్సన్ సమిండ్ల వాణి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ దినేష్, మార్కెట్ కమిటీ చైర్మన్లు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# సీఎంఆర్ అక్రమాలపై ఉక్కుపాదం

మొదటిపేజీ తరువాయి

వచ్చిన ఆరోపణలపై సీఐడీ పోలీసులు చర్యలు చేపట్టారు. ములుగు జిల్లాకు చెందిన ఐదుగురు రైస్ మిల్లర్లను అదుపులోకి తీసుకున్నారు. ములుగు జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, బాదం, శ్రీమాత రైస్ మిల్లుల యజమాని బాదం ప్రవీణ్‌తో పాటు మరో నలుగురు మిల్లర్లను అదుపులోకి తీసుకుని వరంగల్‌లోని సీఐడీ కార్యాలయానికి తరలించారు. ప్రభుత్వ ధాన్యాన్ని సొంత అవసరాలకు వినియోగించడం, కోట్ల రూపాయల్లో బకాయిలు పేరుకుపోవడం వంటి అంశాలపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.
సీఐడీ అదుపులోకి తీసుకున్న వారిలో లేపాక్షి రైస్ మిల్లు యజమాని మోహన్, సాయిరాం రైస్ మిల్లు యజమాని రఘోత్తమ్, వాసవి రైస్ మిల్లు యజమాని శ్రవణ్, ఎల్ఎస్ఆర్ రైస్ మిల్లు యజమాని హరినాథ్ ఉన్నారు. వీరికి చెందిన మిల్లుల్లో సీఎంఆర్ ధాన్యం, బియ్యం నిల్వలకు సంబంధించి అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వానికి తిరిగి అందించాల్సిన ధాన్యాన్ని సొంతానికి వాడుకోవడంతో పాటు బకాయిలు భారీగా పేరుకుపోవడంతో సంబంధిత మిల్లర్లకు గతంలోనే నోటీసులు జారీ చేసినట్లు సమాచారం.
మరోవైపు భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ)కి సన్న బియ్యం సరఫరా చేయాల్సి ఉండగా, వాటి స్థానంలో దొడ్డు బియ్యం అందించినట్లు ఆరోపణలు రావడంతో సీఐడీ అధికారులు దర్యాప్తు చేపట్టారు. 202526 ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం కేటాయింపులకు సంబంధించిన వ్యవహారంపై విచారణ కొనసాగిస్తున్నారు. నిజామాబాద్, కరీంనగర్, ములుగు జిల్లాల్లోని 16 రైస్ మిల్లుల యజమానులు 3,385.820 మెట్రిక్ టన్నుల దొడ్డు బియ్యం సరఫరా చేసినట్లు అధికారులు గుర్తించారు.
ఈ వ్యవహారంలో బోనస్ రూపంలో ప్రభుత్వానికి సుమారు రూ.1.69 కోట్ల నష్టం జరిగినట్లు ప్రాథమికంగా అంచనా వేశారు. అదేవిధంగా మరో 45,414.833 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లింగ్ కోసం కేటాయించినట్లు అధికారులు గుర్తించారు. ఈ కేటాయింపులకు సంబంధించి బోనస్ రూపంలో ప్రభుత్వంపై సుమారు రూ.242 కోట్ల మేర ఆర్థిక ప్రభావం పడే అవకాశం ఉందని పేర్కొన్నారు.
సీఎంఆర్ ధాన్యం కేటాయింపులు, మిల్లింగ్, బియ్యం సరఫరాలో అక్రమాలు జరిగాయా? ప్రభుత్వానికి రావాల్సిన బియ్యాన్ని పక్కదారి పట్టించారా? అనే కోణాల్లో సీఐడీ విచారణ కొనసాగుతోంది. మిల్లర్ల పాత్రతో పాటు ఈ వ్యవహారంలో అధికారుల ప్రమేయం ఉందా? ముందస్తు కుట్రతో అక్రమాలకు పాల్పడ్డారా? అనే అంశాలపైనా అధికారులు దృష్టి సారించారు. దర్యాప్తులో వెలుగుచూసే వివరాల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

# ఐటీ ఉద్యోగాలు కన్నడిగులకు ఇవ్వండి

మొదటిపేజీ తరువాయి

మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు.
కన్నడ ప్రజల హక్కులు, గౌరవానికి భంగం కలిగించే చర్యలను రాష్ట్ర ప్రభుత్వం అనుమతించబోదని శివకుమార్ పేర్కొన్నారు. కన్నడిగుల ప్రతిభ, నైపుణ్యాలు, సామర్థ్యాలను చూసి రాష్ట్రం గర్విస్తోందని తెలిపారు. ఏదైనా ప్రైవేటు సంస్థ స్థానికులను ఉద్దేశపూర్వకంగా నియామకాలకు దూరంగా ఉంచుతున్నట్లు నిర్ధారణైతే తప్పకుండా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.
ఇటీవల కన్నడిగులకు ఉద్యోగాలు నిరాకరిస్తున్నారంటూ సామాజిక మాధ్యమాల్లో పలు వీడియోలు వైరల్ అయ్యాయి. బెంగళూరులోని కొన్ని సంస్థల నియామక విధానాలపై స్థానికులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. స్థానిక అభ్యర్థులకు తగిన ప్రాధాన్యం ఇవ్వడం లేదన్న ఆరోపణలు తెరపైకి రావడంతో ఈ అంశం చర్చనీయాంశమైంది.
తాజాగా ఓ మహిళ చేసిన పోస్టు ఈ వివాదానికి మరింత ప్రాధాన్యం తెచ్చింది. తన రెజ్యూమెలో భాషకు సంబంధించిన వివరాల్లో కన్నడ అని పేర్కొన్నందుకు తన ఉద్యోగ దరఖాస్తును తిరస్కరించారని ఆమె సామాజిక మాధ్యమాల్లో ఆరోపించారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి డీకే శివకుమార్ దృష్టికి తీసుకెళ్లేందుకు ఆయనను కూడా తన పోస్టులో ట్యాగ్ చేశారు. ఇదే తరహా ఫిర్యాదులు ఇటీవల పెరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం స్పందించాలని పలువురు కోరుతున్నారు.
అయితే, మహిళ చేసిన ఆరోపణకు సంబంధించిన పూర్తి వివరాలు, దరఖాస్తు తిరస్కరణకు అసలు కారణం ఏమిటన్నది స్వతంత్రంగా నిర్ధారణ కావాల్సి ఉంది. అయినప్పటికీ, నియామకాల్లో భాష లేదా ప్రాంతం ఆధారంగా ఉద్దేశపూర్వక వివక్ష చూపుతున్నారన్న ఫిర్యాదులను ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తున్నట్లు ముఖ్యమంత్రి వ్యాఖ్యలు స్పష్టం చేస్తున్నాయి.
బెంగళూరు దేశంలోని ప్రధాన ఐటీ కేంద్రాల్లో ఒకటి. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన ఉద్యోగులు ఇక్కడి సాంకేతిక సంస్థల్లో పని చేస్తున్నారు. ఈ నేపథ్యంలో స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్న డిమాండ్, సంస్థలు ప్రతిభ ఆధారంగా నియామకాలు చేపట్టాలన్న వాదన మధ్య ఈ అంశం ప్రాధాన్యం సంతరించుకుంది.
కన్నడిగుల హక్కులను కాపాడటం ప్రభుత్వ బాధ్యత అని శివకుమార్ పేర్కొన్నారు. స్థానిక అభ్యర్థుల ప్రతిభను గుర్తించి వారికి తగిన అవకాశాలు కల్పించాలని సూచించారు. అదే సమయంలో, నియామకాల్లో ఉద్దేశపూర్వకంగా స్థానికులను పక్కనపెడుతున్నట్లు ఆధారాలతో తేలితే సంబంధిత సంస్థలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ వివాదంపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపడుతుందన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# ఉగ్రవాదాన్ని ఉపేక్షించొద్దు

- **రాజకీయ ప్రయోజనాల కోసం ఉగ్రవాదాన్ని ఉపేక్షించొద్దు**
- **ఉగ్రవాదాన్ని ఏ రూపంలోనూ సమర్థించలేం**
- **టెర్రరిజం పట్ల ఏమాత్రం సహనం తగదు**
- **చరిత్ర పాఠాలను పక్కనపెడుతున్న కొన్ని దేశాలు**
- **అంతర్జాతీయ సమాజం కఠిన వైఖరి అవలంబించాలి**
- **ఉగ్రవాదంపై పోరుకు ప్రపంచదేశాలు ఏకం కావాలి**
- **ఉమ్మడిగా ఎదుర్కోవాల్సిన అంతర్జాతీయ ముప్పు**
- **యుద్ధాలతో ప్రపంచానికి విస్తృత ప్రతికూల ప్రభావాలు**
- **ఇరాన్, ఉక్రెయిన్ సంక్షోభాలకు చర్చలే పరిష్కారం**

**న్యూఢిల్లీ, (ప్రజాక్షేత్రం):**

రాజకీయ ప్రయోజనాల కోసం ఉగ్రవాదాన్ని ఉపేక్షించకూడదని, దేశాలు తమ లక్ష్యాల సాధనకు దానిని ఓ సాధనంగా ఉపయోగించుకోరాదని విదేశాంగ శాఖ మంత్రి ఎస్. జైశంకర్ స్పష్టం చేశారు. ఉగ్రవాదాన్ని ఏ రూపంలోనూ సమర్థించలేమని, దాని పట్ల ఏమాత్రం సహనం ప్రదర్శించకూడదని ప్రపంచదేశాలకు పిలుపునిచ్చారు. ఆదివారం న్యూఢిల్లీలో జరిగిన చిన్మయ మిషన్ 75వ వార్షికోత్సవ కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. పాకిస్థాన్‌తో దౌత్య సంబంధాలను కొనసాగించాల్సిన అవసరాన్ని అమెరికా విదేశాంగ శాఖ మంత్రి సమర్థించుకున్న నేపథ్యంలో జైశంకర్ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.
చరిత్ర నేర్పిన పాఠాలను కొన్ని దేశాలు రాజకీయ కారణాలతో పక్కనపెడుతున్నాయని జైశంకర్ విమర్శించారు. ఉగ్రవాదాన్ని ఉపేక్షిస్తూ దాని తీవ్రతను విస్మరిస్తున్నాయని అన్నారు. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా అంతర్జాతీయ సమాజం కఠిన వైఖరి అవలంబించాలని స్పష్టం చేశారు. రాజకీయ ప్రయోజనాల కోసం ఉగ్రవాదాన్ని సమర్థించడం లేదా దాని పట్ల ఉదాసీనంగా వ్యవహరించడం సరైన విధానం కాదని పేర్కొన్నారు.
ప్రపంచ దేశాలన్నీ ఉమ్మడిగా ఎదుర్కొంటున్న ప్రధాన ముప్పుల్లో ఉగ్రవాదం ఒకటని జైశంకర్ అన్నారు. ఈ ప్రమాదాన్ని అరికట్టేందుకు దేశాలు కలిసికట్టుగా ముందుకు సాగాలని సూచించారు. ఉగ్రవాదంపై పోరులో తమ నిబద్ధతను మాటల్లోనే కాకుండా చేతల్లోనూ చూపించాలని పిలుపునిచ్చారు. రాజకీయ లెక్కలను పక్కనపెట్టి, ఉగ్రవాదాన్ని అడ్డుకునేందుకు అంతర్జాతీయ సమాజం సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు.
ప్రపంచంలో ఎక్కడ యుద్ధం జరిగినా దాని ప్రభావం ఆ ప్రాంతానికే పరిమితం కాదని జైశంకర్ హెచ్చరించారు. యుద్ధాలు అంతర్జాతీయ ఆర్థిక, రాజకీయ పరిస్థితులపై విస్తృత ప్రతికూల ప్రభావాన్ని చూపుతున్నాయని చెప్పారు. ఏ మూలన ఘర్షణలు జరిగినా ప్రపంచవ్యాప్తంగా అశాంతి నెలకొనే ప్రమాదం ఉందన్నారు. అందువల్ల వివాదాల పరిష్కారానికి చర్చలు, దౌత్య మార్గాలకే ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.ప్రస్తుతం ఇరాన్, ఉక్రెయిన్‌లో కొనసాగుతున్న యుద్ధాలు, సంక్షోభాలకు చర్చలు, దౌత్యమే పరిష్కార మార్గాలని జైశంకర్ మరోసారి స్పష్టం చేశారు. ఘర్షణలు మరింత తీవ్రం కాకుండా సంబంధిత దేశాలు చర్చల ద్వారా పరిష్కారాలను అన్వేషించాలని అభిప్రాయపడ్డారు. అంతర్జాతీయ శాంతి, స్థిరత్వాన్ని కాపాడేందుకు దేశాల మధ్య సహకారం అవసరమని ఆయన పేర్కొన్నారు.

# 500కు పైగా సినిమాల రహస్య పత్రాలు లీక్?

మొదటిపేజీ తరువాయి

స్పష్టం చేసింది. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణతో పాటు పోర్టల్ భద్రతా తనిఖీ ప్రారంభించినట్లు వెల్లడించింది. దీంతో అసలు ఏం జరిగింది? సినిమాలకు సంబంధించిన పత్రాలు బయటపడ్డాయా? అన్న అంశాలపై ఆసక్తి నెలకొంది.
సినిమాలను థియేటర్లలో విడుదల చేయాలంటే సెన్సార్ బోర్డు ధ్రువీకరణ తప్పనిసరి. ఇందుకోసం నిర్మాతలు తమ చిత్రాలకు సంబంధించిన పూర్తి స్క్రిప్టులు, సన్నివేశాల వివరాలు, ఇతర అవసరమైన పత్రాలను బోర్డుకు సమర్పించాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియను సులభతరం చేసేందుకు సుమారు పదేళ్ల క్రితం 'ఈసినిప్రమాణ్' పోర్టల్‌ను తీసుకొచ్చారు. అప్పటి నుంచి నిర్మాతలు ఈ డిజిటల్ వేదిక ద్వారానే సెన్సార్ ధ్రువీకరణకు అవసరమైన పత్రాలను సమర్పిస్తున్నారు.
తాజాగా ఈ పోర్టల్‌లో భద్రతా లోపం తలెత్తినట్లు వార్తలు వెలువడ్డాయి. సెన్సార్ పరిశీలన కోసం నిర్మాతలు సమర్పించిన స్క్రిప్టులు, బోర్డు సూచించిన కట్స్‌కు సంబంధించిన ఆదేశాలు, ఇతర అధికారిక పత్రాలు అనధికారికంగా అందుబాటులోకి వచ్చినట్లు కథనాలు పేర్కొంటున్నాయి. ఈ ఫైళ్లు 'ఇంటర్నెట్ ఆర్కైవ్' అనే డిజిటల్ లైబ్రరీలో కనిపించాయని, వాటిని ఎవరైనా డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది.
ఈ ఘటనలో 500కు పైగా సినిమాలకు సంబంధించిన పత్రాలు బయటపడ్డాయన్న వార్తలు సినీ పరిశ్రమలో ఆందోళనకు కారణమయ్యాయి. ముఖ్యంగా సినిమా విడుదలకు ముందే పూర్తి కథ, కీలక సన్నివేశాల వివరాలు బహిర్గతమైతే చిత్రాలపై ప్రేక్షకుల్లో ఆసక్తి తగ్గే ప్రమాదం ఉంది. కథాంశాలు, కీలక మలుపులు బయటకు రావడం వల్ల సినిమాల ప్రచార వ్యూహాలపైనా ప్రభావం పడవచ్చని పరిశ్రమ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.
స్క్రిప్టులతో పాటు సెన్సార్ బోర్డు జారీ చేసిన కట్ ఆర్డర్లు, వివిధ వ్యాపార ఒప్పందాలకు సంబంధించిన పత్రాలు కూడా లీక్ అయినట్లు సమాచారం. ఈ పత్రాల్లోని వివరాలు బహిర్గతమైతే నిర్మాతలు, పంపిణీదారులు, ఇతర భాగస్వాముల మధ్య జరిగే వ్యాపార చర్చలకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది. సినిమాల నిర్మాణానికి సంబంధించిన రహస్య సమాచారం బయటపడితే ఆర్థిక లావాదేవీలు, భవిష్యత్ ఒప్పందాలపైనా ప్రతికూల ప్రభావం పడవచ్చన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.
ప్రభుత్వానికి చెందిన డిజిటల్ పోర్టల్‌లో భద్రపరిచిన సమాచారానికి అనధికారికంగా ఇతరులు చేరుకోగలిగితే, ప్రభుత్వ వ్యవస్థల్లోని డేటా భద్రతపై ప్రశ్నలు తలెత్తడం సహజం. నిర్మాతలు తమ సినిమాలకు సంబంధించిన కీలక సమాచారాన్ని ప్రభుత్వ పోర్టల్‌లో సమర్పిస్తున్నందున, ఆ పత్రాల గోప్యతను కాపాడాల్సిన బాధ్యత వ్యవస్థపై ఉంటుంది. ఈ నేపథ్యంలో ఈసినిప్రమాణ్ పోర్టల్‌లో భద్రతా లోపాలు ఉన్నాయా? ఉంటే వాటి స్వరూపం ఏమిటి? ఎంతమేర సమాచారం ప్రభావితమైంది? అనే ప్రశ్నలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.
ఈ పరిణామంపై సీబీఎఫ్‌సీ స్పందించింది. పోర్టల్‌లో అనధికారికంగా డేటా యాక్సెస్ జరిగినట్లు వచ్చిన నివేదికలను పరిశీలించినట్లు తెలిపింది. అదే సమయంలో, ఎలాంటి డేటా లీకేజీ జరగలేదని స్పష్టం చేసింది. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ చేపట్టడంతో పాటు పోర్టల్ భద్రతను తనిఖీ చేసే ప్రక్రియను ప్రారంభించినట్లు వెల్లడించింది.
అయితే, లీక్ జరిగినట్లు వచ్చిన వార్తలు, బోర్డు ఇచ్చిన వివరణ మధ్య ఉన్న వ్యత్యాసంపై స్పష్టత రావాల్సి ఉంది. ఏవైనా పత్రాలు అనధికారికంగా అందుబాటులోకి వచ్చాయా? ఇంటర్నెట్ ఆర్కైవ్‌లో కనిపించిన ఫైళ్లకు పోర్టల్‌తో సంబంధం ఉందా? వాటిని ఎవరైనా డౌన్‌లోడ్ చేసుకున్నారా? అనే అంశాలు విచారణలో తేలాల్సి ఉంది. భద్రతా తనిఖీ పూర్తయిన తర్వాతే ఈ ఘటన తీవ్రతపై స్పష్టమైన అంచనాకు వచ్చే అవకాశం ఉంది.
మొత్తంగా, ఈసినిప్రమాణ్ పోర్టల్ వ్యవహారం ప్రభుత్వ డిజిటల్ వేదికల్లో సమాచార భద్రత ప్రాధాన్యాన్ని మరోసారి గుర్తుచేస్తోంది. ముఖ్యంగా సినిమాల స్క్రిప్టులు, సెన్సార్ ఆదేశాలు, వ్యాపార పత్రాల వంటి కీలక సమాచారాన్ని భద్రపరిచే వ్యవస్థల్లో భద్రతా ప్రమాణాలు పటిష్ఠంగా ఉండాల్సిన అవసరాన్ని ఈ ఘటన ముందుకు తెచ్చింది. సీబీఎఫ్‌సీ విచారణలో వెలువడే వివరాల ఆధారంగా ఈ వ్యవహారంపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.




# రూ.600కే వారం రోజులు ఆర్టీసీ ప్రయాణం

మొదటిపేజీ తరువాయి

వ్యాపారులు, ఇతర పనులపై నగరంలో తిరిగే వారికి ఇది ప్రయోజనకరంగా ఉంటుంది. ప్రతిసారీ టికెట్ కొనుగోలు చేయాల్సిన అవసరం లేకుండా ప్రయాణించే వీలుంటుంది.

**అన్ని రకాల సిటీ బస్సుల్లో సౌకర్యం**

ఈ పాస్‌తో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని అన్ని రకాల సిటీ బస్సుల్లో ప్రయాణించవచ్చని ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఏసీ బస్సుల్లోనూ ఈ పాస్ చెల్లుబాటు అవుతుంది. అయితే, విమానాశ్రయానికి నడిచే పుష్పక్ ఎయిర్‌పోర్ట్ లైనర్ సర్వీసులకు మాత్రం ఇది వర్తించదు. పాస్ కొనుగోలు చేసే ముందు ప్రయాణికులు ఈ మినహాయింపును గమనించాలి.

**ఆర్టీసీ కౌంటర్లలో పాస్‌లు**

నగరంలోని అన్ని ఆర్టీసీ కౌంటర్లలో వీక్లీ పాస్‌లు అందుబాటులో ఉంటాయని అధికారులు వెల్లడించారు. కొనుగోలు చేసిన మొదటి రోజు నుంచి ఏడు రోజుల పాటు పాస్ చెల్లుబాటవుతుంది. ప్రయాణికులు తమ అవసరాలను బట్టి పాస్‌ను కొనుగోలు చేసుకోవచ్చు.

**తరచూ ప్రయాణించేవారికి మేలు**

నగరంలో రోజూ పలుచోట్లకు వెళ్లేవారు, వారంలో ఎక్కువ రోజులు బస్సుల్లో ప్రయాణించేవారు ఈ పాస్‌తో ఖర్చులను నియంత్రించుకోవచ్చు. బడ్జెట్‌కు అనుకూలమైన నగర ప్రయాణాన్ని ప్రోత్సహించడమే ఈ నిర్ణయం లక్ష్యమని ఆర్టీసీ అధికారులు తెలిపారు.

# రాహుల్‌కు కాంగ్రెస్ సర్కార్ ఏటీఎం..

మొదటిపేజీ తరువాయి

చేసిన కార్యక్రమంలో కేటీఆర్ మాట్లాడారు.

**రాహుల్ మౌనం వెనుక మర్మమదే**

దేశమంతా తిరుగుతూ 'ఛాత్రోంకీ గూంజ్' అంటూ ఉపన్యాసాలిచ్చే రాహుల్ గాంధీకి తెలంగాణలో అడుగుపెట్టే ధైర్యం లేదని కేటీఆర్ ఎద్దేవా చేశారు. ఎన్నికల ముందు 420 హామీలిచ్చి, వెయ్యి రోజులు గడుస్తున్నా వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. "రాహుల్ గాంధీ అడ్రస్ లేకుండా పోయారు. తెలంగాణలో ఏం జరుగుతుందో ఆయనకు పట్టడం లేదు. ఎందుకంటే ఆయనకు అందాల్సినవి అందుతున్నాయి. అందుకే ఇక్కడి స్కామ్‌లపై, ప్రభుత్వ వైఫల్యాలపై నోరు మెదపడం లేదు" అని కేటీఆర్ ఆరోపించారు.
ఎన్నికలకు ముందు హైదరాబాద్‌లోని అశోక్‌నగర్‌లో టీ స్టాల్ వద్ద కూర్చొని నిరుద్యోగ యువతకు ఉద్యోగాల గురించి భరోసా ఇచ్చిన రాహుల్ గాంధీ, ఇప్పుడు వారిని పూర్తిగా విస్మరించారని అన్నారు. మైనారిటీల కోసం ప్రత్యేక డిక్లరేషన్ ప్రకటించి, సంక్షేమానికి రూ.4,000 కోట్లు కేటాయిస్తామన్న హామీని గాలికొదిలేశారని విమర్శించారు. ఆసరా పెన్షన్‌ను రూ.4,000కు పెంచుతామని, రైతులకు ఎకరానికి రూ.15,000 ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి, ఇప్పుడు మాట తప్పారని మండిపడ్డారు.
ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తే సమాధానం చెప్పాల్సింది పోయి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తిట్లతో, అక్రమ కేసులతో బెదిరిస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. రేవంత్ రెడ్డి పాలనలో వరుస కుంభకోణాలు వెలుగులోకి వస్తున్నాయని, ముఖ్యంగా ఆయన కుటుంబ సభ్యులకు సంబంధించిన భూ వ్యవహారాలు అనుమానాస్పదంగా ఉన్నాయని అన్నారు. "సుమారు రూ.200 కోట్ల విలువైన ఐదు ఎకరాల భూమిని కేవలం రూ.7 కోట్లకే తన తమ్ముడికి కట్టబెట్టారు. అమెరికాలో ఉంటున్న మరో సోదరుడికి సంబంధించిన రూ.1,000 కోట్ల డీల్‌పై కూడా అనేక అనుమానాలు ఉన్నాయి. వీటిపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపి వాస్తవాలు వెల్లడించాలి" అని కేటీఆర్ డిమాండ్ చేశారు.

**2028లో కేసీఆరే మళ్లీ సీఎం**

ఢిల్లీలో బీజేపీ ప్రభుత్వం ప్రజల మధ్య మతపరమైన విభజనలు సృష్టిస్తుంటే, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను దోచుకుంటుందని కేటీఆర్ అన్నారు. దేశంలో ప్రధాని మోదీని ఎదుర్కొనే సత్తా కాంగ్రెస్‌కు లేదని, తెలంగాణ ప్రయోజనాలను కాపాడే ఏకైక శక్తి బీఆర్ఎస్ మాత్రమేనని స్పష్టం చేశారు. ప్రజా సమస్యలపై పోరాడుతూ, ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడతామని తెలిపారు. "ఇంకో ఏడాదిన్నరలో బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయం. 2028లో కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారు. తెలంగాణను తిరిగి దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దుతాం" అని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు.

# బీజేపీని ఎలా బలోపేతం చేద్దాం!

మొదటిపేజీ తరువాయి

వ్యూహాలపై ఈ భేటీలో చర్చించనున్నట్లు తెలుస్తోంది.
తెలంగాణలో పార్టీ రాజకీయ కార్యాచరణను మరింత వేగవంతం చేయడంపై అధిష్ఠానం దృష్టి సారించినట్లు సమాచారం. రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ పరిస్థితులు, ప్రజల్లో పార్టీకి ఉన్న ఆదరణ, క్షేత్రస్థాయిలో పార్టీ సంస్థాగత బలం వంటి అంశాలపై నేతలతో చర్చించనున్నట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ముఖ్య నేతలకు అధిష్ఠానం దిశానిర్దేశం చేయనుంది.
రాష్ట్రవ్యాప్తంగా చేపట్టబోయే ప్రజాందోళనలు, నిరసన కార్యక్రమాలపైనా సమావేశంలో చర్చించే అవకాశం ఉంది. ప్రజా సమస్యలను ప్రధానంగా తీసుకుని ప్రభుత్వంపై పోరాటాలను ఎలా నిర్వహించాలి? ఏ అంశాలపై ప్రజల్లోకి వెళ్లాలి? పార్టీ శ్రేణులను ఏ విధంగా సమాయత్తం చేయాలి? అనే అంశాలపై సమాలోచనలు జరగనున్నట్లు సమాచారం. ప్రజా సమస్యలపై పోరాటాల ద్వారా పార్టీ కార్యకలాపాలను విస్తరించడంపై నేతలకు సూచనలు ఇవ్వనున్నట్లు తెలుస్తోంది.
రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని గ్రామస్థాయి నుంచి పార్టీని పటిష్ఠం చేయడంపై కూడా చర్చించనున్నారు. క్షేత్రస్థాయిలో కార్యకర్తలను సమన్వయం చేయడం, స్థానికంగా పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని బలోపేతం చేయడం, ప్రజలతో నిరంతరం సంబంధాలు కొనసాగించడం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు సమాచారం. రాష్ట్రంలోని రాజకీయ పరిణామాలకు అనుగుణంగా పార్టీ భవిష్యత్ కార్యాచరణను రూపొందించడమే ఈ సమావేశం ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోంది.
ఢిల్లీ సమావేశంలో అధిష్ఠానం ఇచ్చే సూచనల ఆధారంగా తెలంగాణలో బీజేపీ తదుపరి రాజకీయ కార్యక్రమాలు ఖరారయ్యే అవకాశం ఉంది. ప్రజా సమస్యలపై ఆందోళనలు, నిరసన కార్యక్రమాలను ముమ్మరం చేయడంతో పాటు పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసే దిశగా అడుగులు వేయనున్నట్లు తెలుస్తోంది. అయితే, సమావేశంలో చర్చించే అంశాలు, తీసుకునే నిర్ణయాలపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

# మారుమూల గ్రామాల సమస్యలకు శాశ్వత పరిష్కారం

- **మక్తల్ నియోజకవర్గ అభివృద్ధిపై మంత్రి వాకిటి శ్రీహరి ప్రత్యేక దృష్టి**
- **అమరచింత మండలంలోని 14 గ్రామాలపై సమీక్ష**
- **సర్పంచులు, ఉపసర్పంచులతో గ్రామాలవారీగా చర్చలు**
- **ప్రతి గ్రామానికి అరగంట సమయం కేటాయింపు**
- **ప్రజల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్న మంత్రి**
- **తక్షణ పరిష్కారాలకు ప్రాధాన్యం**
- **భవిష్యత్ అభివృద్ధి పనులపై ప్రత్యేక కార్యాచరణ**
- **గ్రామాలవారీగా సమస్యలపై ప్రత్యేక నోట్ సిద్ధం**
- **పనుల పూర్తికి గడువు నిర్ణయించాలని ఆదేశం**
- **రహదారులు, తాగునీరు, పారిశుధ్యంపై దృష్టి**




**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

మారుమూల గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటికి శాశ్వత పరిష్కారాలు చూపడమే లక్ష్యంగా ప్రత్యేక కార్యాచరణ చేపట్టినట్లు మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. మక్తల్ నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి సారిస్తూ ఆదివారం అమరచింత మండలంలోని 14 గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యలపై ఆయన సమీక్ష నిర్వహించారు. గ్రామాలవారీగా సర్పంచులు, ఉపసర్పంచులు, పార్టీ అధ్యక్షులు, ముఖ్య నాయకులతో చర్చించారు. ప్రతి గ్రామానికి సుమారు అరగంట సమయం కేటాయించి, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు.
గ్రామాల్లో తక్షణమే పరిష్కరించాల్సిన సమస్యలతో పాటు భవిష్యత్తులో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై సమగ్రంగా చర్చించారు. సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత క్రమాన్ని నిర్ణయించి, అవసరమైన చర్యలు చేపట్టేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలు, వాటి పరిష్కార మార్గాలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనుల వివరాలతో మంత్రి స్వయంగా ప్రత్యేక నోట్ రూపొందించారు.
మండల కేంద్రాలు, పట్టణాల్లోని సమస్యలకే పరిమితం కాకుండా మారుమూల గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపైనా ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని మంత్రి పేర్కొన్నారు. ప్రతి గ్రామానికి సమాన ప్రాధాన్యం ఇస్తూ, స్థానిక ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. ప్రజాప్రతినిధులు గ్రామాల్లో పర్యటిస్తూ సమస్యలను గుర్తించాలని, వాటి పరిష్కారానికి అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు.
గ్రామాల్లో రహదారులు, తాగునీరు, విద్యుత్, పారిశుధ్యం తదితర మౌలిక సదుపాయాలకు సంబంధించిన సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నట్లు వాకిటి శ్రీహరి వెల్లడించారు. ప్రతి సమస్య పరిష్కారానికి స్పష్టమైన ప్రణాళిక సిద్ధం చేయడంతో పాటు, అభివృద్ధి పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు, ప్రజాప్రతినిధులకు సూచించారు.ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను అందుబాటులోకి తీసుకురావడం, గ్రామాల అభివృద్ధిని వేగవంతం చేయడం ఈ సమీక్షల ప్రధాన ఉద్దేశమని మంత్రి తెలిపారు. గ్రామాల్లో గుర్తించిన సమస్యల పరిష్కారంపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని పేర్కొన్నారు.

## మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పదవి మాదిగలకు ఇవ్వాలి

- **40 ఏళ్ల కాంగ్రెస్ సేవలకు గుర్తింపు ఇవ్వాలి**
- **సీనియర్ నేత గంగి యాదయ్య విజ్ఞప్తి**

**చేవెళ్ల,అక్టోబర్ 25(ప్రజాక్షేత్రం):**



చేవెళ్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పదవిని ఈసారి మాదిగ సామాజిక వర్గానికి కేటాయించాలని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, మాజీ ఉపసర్పంచ్ గంగి యాదయ్య కోరారు. గత 40 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీకి సేవలందిస్తున్న తనకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. మార్కెట్ కమిటీ పదవుల్లో గతంలో ప్రధానంగా మాల సామాజిక వర్గానికి ప్రాధాన్యం లభించిందని, ఈసారి మాదిగలకు అవకాశం ఇవ్వాలని కోరారు. తన తండ్రి గంగి అంతయ్య 30 ఏళ్లపాటు వార్డు సభ్యుడిగా సేవలందించగా, తాను గ్రామ ఉపసర్పంచ్‌గా పనిచేశానని తెలిపారు. పార్టీ కోసం చేసిన సేవలను గుర్తించి వైస్ చైర్మన్ పదవి కల్పించాలని కాంగ్రెస్ అధిష్ఠానానికి మనవి తెలిపాడు.

## రక్తదానమే.. ప్రాణదానానికి మార్గం!

- **45వసారి రక్తదానం చేసిన డాక్టర్ కురిమేటి నవీన్**
- **యంగ్ ఇండియన్ బ్లడ్ డోనర్స్ క్లబ్ ఆధ్వర్యంలో శిబిరం**
- **ముఖ్య అతిథులుగా సినీ దర్శకుడు మెహర్ రమేష్, ది మిషన్ ఫౌండర్ చైర్మన్ ఏడుకొండలు**

**రంగారెడ్డి జిల్లా,అక్టోబర్ 25 (ప్రజాక్షేత్రం):**

ఆపదలో ఉన్నవారికి సకాలంలో రక్తం అందించి ప్రాణాలను కాపాడటమే లక్ష్యంగా పాటిమట్ల గ్రామానికి చెందిన మాతృదేవోభవ పితృదేవోభవ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కురిమేటి నవీన్ సేవా స్ఫూర్తిని చాటారు. హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ జన్మదినాన్ని పురస్కరించుకుని యంగ్ ఇండియన్ బ్లడ్ డోనర్స్ క్లబ్ ఫౌండర్ జేబీ బాలు ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని చిరంజీవి బ్లడ్ బ్యాంకులో నిర్వహించిన రక్తదాన శిబిరంలో నవీన్ 45వసారి రక్తదానం చేశారు. రక్తదానం పట్ల తనకున్న నిబద్ధతను చాటుతూ పలువురికి ఆదర్శంగా నిలిచారు.

**మాతృదేవోభవ పితృదేవోభవ సేవలకు ప్రశంసలు**

ఈ కార్యక్రమానికి ప్రముఖ సినీ దర్శకుడు మెహర్ రమేష్, ది మిషన్ ఫౌండర్ చైర్మన్, రామన్నపేట ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఏడుకొండలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. డాక్టర్ నవీన్ ఆధ్వర్యంలో మాతృదేవోభవ పితృదేవోభవ సంస్థ చేపడుతున్న సేవా కార్యక్రమాలను వారు అభినందించారు. రక్తదానంతో పాటు అంబులెన్స్ సేవలు, గ్రంథాలయ ఏర్పాటు, ఆడపిల్లలకు సహాయం, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అండగా నిలవడం వంటి కార్యక్రమాల ద్వారా సమాజానికి సేవలందించడం అభినందనీయమని పేర్కొన్నారు. 45వసారి రక్తదానం చేయడం ద్వారా నవీన్ మరింత మందికి స్ఫూర్తిగా నిలిచారని కొనియాడారు.

**ఆపదలో ఉన్నవారికి ప్రాణదాతలుగా నిలవాలి: డా.నవీన్**

ఈ సందర్భంగా డాక్టర్ కురిమేటి నవీన్ మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో రక్తం అందక ఇబ్బందులు పడుతున్న వారికి అండగా నిలిచి, విలువైన ప్రాణాలను కాపాడటమే తమ సంస్థ ప్రధాన లక్ష్యమని తెలిపారు. రక్తదానంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని, ఆరోగ్యపరంగా అర్హులైన వారు స్వచ్ఛందంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రక్తదానం చేయడం ద్వారా ఆపదలో ఉన్నవారికి ప్రాణదాతలుగా నిలవవచ్చని పేర్కొన్నారు. సమాజ సేవలో భాగంగా తమ సంస్థ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని వెల్లడించారు.

**రక్తాన్ని తయారు చేయలేం.. మానవత్వంతోనే అందించగలం: ఏడుకొండలు**

ది మిషన్ ఫౌండర్ చైర్మన్ ఏడుకొండలు మాట్లాడుతూ రక్తాన్ని కృత్రిమంగా తయారు చేయడం సాధ్యం కాదని, అవసరమైన సమయంలో ఇతరుల నుంచి స్వచ్ఛంద రక్తదానం ద్వారానే రక్తాన్ని సమకూర్చుకోగలమని అన్నారు. రక్తం అందక ఏ ఒక్కరూ ప్రాణాపాయానికి గురికాకూడదంటే సమాజంలో రక్తదానంపై మరింత చైతన్యం రావాలని ఆకాంక్షించారు. ప్రతి కుటుంబం నుంచి కనీసం ఒకరైనా రక్తదాతగా ముందుకు వచ్చి ఈ మహత్తర సేవలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మంచి లక్ష్యంతో రక్తదాన శిబిరాన్ని నిర్వహించిన యంగ్ ఇండియన్ బ్లడ్ డోనర్స్ క్లబ్ ఫౌండర్ జేబీ బాలు, నిర్వాహకులను అభినందించారు.

**రక్తదానం చేయండి.. ప్రాణాలను కాపాడండి: జేబీ బాలు !**

ఏ ఇంట్లో కూడా రక్తం లభించక ప్రాణాలు కోల్పోకూడదనేది యంగ్ ఇండియన్ బ్లడ్ డోనర్స్ క్లబ్ లక్ష్యమని, సినీ నటులు మెగాస్టార్ చిరంజీవి లక్ష్యం కూడా ఇదేనని ఫౌండర్ జే.బీ బాలు అన్నారు. మనం చేసే చిన్న సహాయం మరొకరి కుటుంబంలో వెలుగులు నింపుతుందని. వైద్యపరంగా అర్హులైన వారు రక్తదానం చేయాలన్నారు. రక్తదానం యొక్క ప్రాముఖ్యతను చాటి చెప్పేందుకు ఇలాంటి రక్తదాన శిబిరాలు మార్గం చూపుతాయి అన్నారు.ఈ కార్యక్రమంలో వరల్డ్ రికార్డు బ్లడ్ డోనర్ సంపత్,ప్రభావశీలి ప్రేరణాత్మక వక్త, సామాజిక కార్యకర్త సి, గౌతమ్,సంస్థ సభ్యులు ఎం.డి అహ్మద్,నరసింహ,మహేష్ తదితరులు పాల్గొన్నారు.






## డీసీఎం ఢీకొని మహిళ మృతి

**మొయినాబాద్,అక్టోబర్ 25(ప్రజాక్షేత్రం):**



అతివేగంగా వచ్చిన డీసీఎం వాహనం ఢీకొని ఓ మహిళ అక్కడికక్కడే మృతి చెందిన ఘటన మొయినాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అజిత్ నగర్ చౌరస్తా వద్ద ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం చిలుకూరు గ్రామానికి చెందిన గౌడుగు మల్లేష్ భార్య చిన్న నాగమణి (50) గృహిణి. ఆమె ఆదివారం ఉదయం 8 గంటల సమయంలో తన కుమార్తె వద్దకు వెళ్తున్నానని ఇంటి నుంచి బయలుదేరింది. అనంతరం అజిత్ నగర్ చౌరస్తా వద్ద బస్సు కోసం వేచి ఉండగా, హైదరాబాద్ నుంచి మొయినాబాద్ వైపు వస్తున్న డీసీఎం వాహనం (టీఎస్ 15 యూడి 0427) ఆమెను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నాగమణికి తల, ఛాతీ భాగాల్లో తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటనపై మృతురాలి భర్త గౌడుగు మల్లేష్ ఫిర్యాదు మేరకు మొయినాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# తెలంగాణలో కరువు కల్లోలం

- **కరువు కాటుకు రైతన్న విలవిల!**
- **వానల జాడేది? పంటల బతుకేది?**
- **ఎండుతున్న పొలాలు.. ఆవిరవుతున్న ఆశలు**
- **అన్నదాతకు అండేది? ఆదుకునే దిక్కేది?**
- **ముంచుకొస్తున్న కరువు.. మేల్కొనని పాలనా యంత్రాంగం!**
- **పంటలు ఎండిపోతుంటే.. రైతు కన్నీరు తుడిచేదెవరు?**
- **వర్షా భావంతో విలవిలలాడుతున్న పల్లెలు.. పెట్టుబడులు నేలపాలు అవుతాయనే భయం.. పరిహారం కోసం అన్నదాత ఎదురుచూపులు!**





**వికారాబాద్ బ్యూరో,అక్టోబర్ 25(ప్రజాక్షేత్రం):**

తెలంగాణ పల్లెలపై కరువు మేఘాలు కమ్ముకుంటున్నాయి. ఆకాశం వైపు ఆశగా ఎదురుచూసిన రైతన్నకు నిరాశే మిగులుతోంది. చినుకు జాడ లేక పొలాల్లో తేమ తగ్గిపోతోంది. పచ్చగా కళకళలాడాల్సిన పంటలు వాడిపోతున్నాయి. అప్పులు చేసి విత్తనాలు కొనుగోలు చేసిన రైతు.. ఎరువులు వేసి, కూలీలతో పనులు చేయించిన అన్నదాత.. ఇప్పుడు తన కళ్ల ముందే పంట ఎండిపోతుంటే దిక్కుతోచని స్థితిలో పడుతున్నాడు. ప్రకృతి వైపరీత్యం ఒకవైపు.. పెట్టుబడుల భారం మరోవైపు.. భవిష్యత్తుపై భయం ఇంకోవైపు.. రైతు జీవితాన్ని చుట్టుముడుతున్నాయి.

**చినుకు కోసం ఎదురుచూపులు.. చితికిపోతున్న బతుకులు!**

వర్షాలు సమృద్ధిగా కురిసి చెరువులు నిండితేనే పల్లెల్లో వ్యవసాయం కళకళలాడుతుంది. బావులు, బోర్లు, చెరువులపై ఆధారపడి సాగు చేసే రైతులకు వర్షాభావం తీవ్ర సమస్యగా మారుతోంది. నీటి లభ్యత తగ్గితే పంటలను కాపాడుకోవడం కష్టమవుతుంది. పంటకు అవసరమైన కీలక దశలో వర్షం కురవకపోతే దిగుబడులపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉంది. పత్తి, వరి సహా వివిధ పంటలు సాగు చేసిన రైతులు వర్షాల కోసం ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే పెట్టిన పెట్టుబడి తిరిగి వస్తుందో లేదో తెలియని పరిస్థితి. పంట చేతికి వస్తే అప్పులు తీర్చవచ్చని భావించిన రైతుకు ప్రకృతి పరీక్ష పెడుతోంది. పంట ఎండిపోతే పెట్టుబడి నష్టమే కాకుండా వచ్చే సీజన్ సాగుకు అవసరమైన మూలధనం కూడా ప్రశ్నార్థకమవుతుంది.

**అధికారిక గణాంకాల్లో వర్షా భావం.. క్షేత్రస్థాయిలో కరువు ఛాయలు!**

అక్టోబర్ 24 నాటికి అందుబాటులో ఉన్న గణాంకాల ప్రకారం, తెలంగాణలో జూన్ 1 నుంచి అక్టోబర్ 24 వరకు 619 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. సాధారణ వర్షపాతం 819.3 మిల్లీమీటర్లు కాగా, సుమారు 24 శాతం లోటు నమోదైంది. వర్షాభావ పరిస్థితులపై వెలువడిన ప్రాథమిక అంచనాల్లో 315 మండలాలు ప్రభావితమైనట్లు, వాటిలో 101 మండలాల్లో తీవ్ర పరిస్థితులు ఉన్నట్లు నివేదికలు పేర్కొన్నాయి. వర్షపాతం గణాంకాలు ఒకవైపు ఉంటే.. పొలాల్లో పంటల పరిస్థితి మరోవైపు ఉంటుంది. అందువల్ల ప్రతి గ్రామంలో వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి, వాస్తవ పరిస్థితులను నమోదు చేయాలి. పంట నష్టం ఎంత జరిగింది? ఎంత విస్తీర్ణంలో దిగుబడులు తగ్గే ప్రమాదం ఉంది? ఎంతమంది రైతులు ప్రభావితమయ్యారు? అనే వివరాలను బహిర్గతం చేయాలి.

**పరిహారం ఎప్పుడిస్తారు? రైతుకు భరోసా ఎక్కడ?**

కరువు పరిస్థితుల్లో రైతుకు కావాల్సింది కేవలం ఓదార్పు మాటలు కాదు.. ఆచరణలో కనిపించే సహాయం. పంట నష్టపోయిన రైతుకు పరిహారం, తదుపరి సాగుకు పెట్టుబడి, పశువులకు మేత, గ్రామాల్లో తాగునీటి సౌకర్యం అవసరం. ఇవన్నీ సమయానికి అందితేనే రైతు కుటుంబం సంక్షోభం నుంచి బయటపడగలదు.

ప్రభుత్వం ప్రతిపాదించిన సహాయ ప్యాకేజీలకు సంబంధించిన నిధులు ఎంతవరకు మంజూరయ్యాయి? ఎంత విడుదలయ్యాయి? అర్హులైన రైతుల ఖాతాల్లో ఎంత జమ అయ్యింది? అనే వివరాలను ప్రభుత్వం స్పష్టంగా ప్రకటించాలి. కేవలం నిధుల ప్రతిపాదనలను ప్రకటించడం కాకుండా, క్షేత్రస్థాయిలో రైతులకు అందిన ప్రయోజనాలను వెల్లడించాలి.

పంట నష్టం అంచనాలను పారదర్శకంగా నిర్వహించి, అర్హులైన రైతులకు నిబంధనల ప్రకారం పరిహారం అందించాలి. పంటల బీమా వర్తించే రైతులకు క్లెయిమ్‌ల ప్రక్రియను వేగవంతం చేయాలి. బ్యాంకు రుణాలు, వడ్డీ భారం, తదుపరి సాగు ఖర్చుల విషయంలో కూడా రైతులకు చట్టబద్ధంగా అందుబాటులో ఉన్న ఉపశమన మార్గాలను వివరించాలి.

**ప్రకటనలు కాదు.. క్షేత్రస్థాయిలో చర్యలు కావాలి!**

కరువు తీవ్రత పెరిగిన తర్వాత స్పందించడం కంటే ముందుగానే చర్యలు చేపట్టడం ముఖ్యం. మండలాల వారీగా వర్షపాతం, నేలలో తేమ, జలాశయాల్లో నీటి నిల్వలు, పంటల పరిస్థితిని నిరంతరం సమీక్షించాలి. నీటి కొరత ఉన్న ప్రాంతాల్లో పంటలను కాపాడుకునేందుకు వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలు అందించాలి. ప్రత్యామ్నాయ పంటలు, తక్కువ నీటితో సాగు చేసే పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించాలి.గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలి. పశువులకు మేత, నీటి కొరత ఏర్పడకుండా పశుసంవర్ధక శాఖ చర్యలు చేపట్టాలి. రైతులకు అవసరమైన సమాచారాన్ని గ్రామ స్థాయిలో అందుబాటులో ఉంచాలి.

**అన్నదాత కన్నీరు..**

**పాలకులకు కనిపించడం లేదా?**

రైతు పంట పండితేనే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు బలం చేకూరుతుంది. గ్రామీణ మార్కెట్లలో వ్యాపారం పెరుగుతుంది. వ్యవసాయ కూలీలకు ఉపాధి లభిస్తుంది. రవాణా, విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పరికరాల రంగాలకు కూడా వ్యవసాయమే ఆధారం. అలాంటి రైతు పంట నష్టపోతే దాని ప్రభావం ఒక్క కుటుంబానికే పరిమితం కాదు.. మొత్తం గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై పడుతుంది.అందుకే కరువు సమస్యను సాధారణ వర్షాభావంగా తీసుకోకూడదు. రైతుల పరిస్థితిని అంచనా వేసి, తక్షణ ఉపశమనం నుంచి దీర్ఘకాలిక నీటి నిర్వహణ వరకు సమగ్ర కార్యాచరణ రూపొందించాలి. ప్రతి జిల్లాలో బాధిత రైతుల వివరాలు సేకరించి, సహాయం ఎవరికి అందింది? ఎవరికి అందలేదు? ఎందుకు అందలేదు? అనే అంశాలపై పర్యవేక్షణ ఉండాలి.

**ఇప్పటికైనా మేల్కొనాలి!**

తెలంగాణ పల్లెల్లో కరువు తీవ్రత పెరిగితే రైతుల అప్పులు, సాగు ఖర్చులు, గ్రామీణ ఉపాధిపై మరింత ఒత్తిడి ఏర్పడే ప్రమాదం ఉంది. అందుకే ప్రభుత్వం, వ్యవసాయ శాఖ, జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలి. పంట నష్టం అంచనాలు, పరిహారం, నీటి సరఫరా, ప్రత్యామ్నాయ సాగు ప్రణాళికలపై తక్షణ నిర్ణయాలు తీసుకోవాలి.

రైతు కష్టాన్ని గణాంకంగా కాకుండా.. ఒక కుటుంబం ఎదుర్కొంటున్న జీవన సంక్షోభంగా చూడాలి. ఎండిపోతున్న పంటకు నీరు.. నష్టపోయిన రైతుకు న్యాయమైన సాయం.. భవిష్యత్తు సాగుకు భరోసా కల్పించినప్పుడే కరువు కష్టాలను ఎదుర్కొనే అవకాశం ఉంటుంది. అన్నదాతను ఆదుకోవడం దయ కాదు.వ్యవసాయాన్ని,గ్రామీణ సమాజాన్ని కాపాడే బాధ్యత.





## గత పాలనపై చర్చకు సిద్ధం.. ప్రజలే తేల్చాలి!

- **మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డికి ఎమ్మెల్యే మేఘారెడ్డి సవాల్**

**వనపర్తి,అక్టోబర్ 25 (ప్రజాక్షేత్రం):**

గత ప్రభుత్వ తొమ్మిదేళ్ల పాలన, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుపై ప్రజల సమక్షంలో చర్చించేందుకు సిద్ధంగా ఉన్నానని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు.

రాజకీయాల్లో వ్యక్తిగత విమర్శలు, బెదిరింపు వ్యాఖ్యల కంటే అభివృద్ధి, ప్రజాసేవకే ప్రాధాన్యమివ్వాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డికి సూచించారు.

ఆదివారం వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

గత అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవించాలని మేఘారెడ్డి అన్నారు.

గత పాలనలో బీసీ నాయకులపై కేసులు, విలేకరులపై అట్రాసిటీ కేసుల నమోదు, వివిధ వర్గాల ప్రజలు ఎదుర్కొన్న ఇబ్బందులపై విమర్శలు వచ్చాయని గుర్తుచేశారు. ఉద్యోగాల నియామకాలు, కమిషన్ల వ్యవహారాలపైనా ఆరోపణలు ఉన్నాయని పేర్కొన్నారు. గత పాలనలో ఎదురైన పరిస్థితుల నేపథ్యంలోనే ప్రజలు కాంగ్రెస్‌కు అవకాశం ఇచ్చారని అన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వ తొమ్మిదేళ్ల పాలనలో జరిగిన అభివృద్ధి, కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలపై బహిరంగ చర్చకు సిద్ధమని ఎమ్మెల్యే ప్రకటించారు.

గత ప్రభుత్వ పాలనకు సంబంధించిన పత్రాలతో నిరంజన్‌రెడ్డి చర్చకు రావాలని కోరారు. రెండు ప్రభుత్వాల పనితీరును పరిశీలించి ఎవరు అభివృద్ధి చేశారో ప్రజలే నిర్ణయిస్తారని పేర్కొన్నారు.రాజకీయ నాయకులు వయసుకు తగిన హుందాతనంతో మాట్లాడాలని సూచించారు. వ్యక్తిగత దూషణలు, బెదిరింపులతో ప్రజల్లో విశ్వాసం పొందలేరన్నారు. వనపర్తి ప్రజలు విజ్ఞులు, మేధావులని, రాజకీయ పరిణామాలను నిశితంగా గమనిస్తున్నారని చెప్పారు. రానున్న ఎన్నికల్లోనూ ప్రజలే తమ తీర్పుతో సమాధానం చెబుతారని వ్యాఖ్యానించారు. వనపర్తి రాజకీయాల్లో అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన అంశాలుగా ఉండాలని మేఘారెడ్డి పేర్కొన్నారు. సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు శివసేనారెడ్డి,కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.




## ఆర్మూర్ ఎలక్ట్రానిక్ మీడియా నూతన కార్యవర్గం ఎన్నిక

**నిజామాబాదు,అక్టోబర్ 25(ప్రజాక్షేత్రం):**

ఆర్మూర్ నియోజకవర్గ ఎలక్ట్రానిక్ సాటిలైట్ మీడియా నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. నియోజకవర్గ పరిధిలోని ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు సమావేశమై నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

ఈ సందర్భంగా నూతన కార్యవర్గంలో అధ్యక్షుడిగా 10 టీవీ రిపోర్టర్ దూద్వాట్ శ్రీనివాస్,ఉపాధ్యక్షుడిగా సాక్షి టీవీ ప్రతినిధి షాదుల్లా ,ప్రధాన కార్యదర్శిగా టీవీ9 ప్రతినిధి చిరంజీవి ,వంశీకుమార్ హెచ్ఎం టీవీ ప్రతినిధి, గౌరవ అధ్యక్షులుగా రాజేశ్వర్ గౌడ్ టీవీ5 రిపోర్టర్, సలహాదారులుగా నరేందర్ ఐ న్యూస్ రిపోర్టర్‌గా బాధ్యతలు చేపట్టారు.

నూతన కార్యవర్గం ఆధ్వర్యంలో ఆర్మూర్ నియోజకవర్గంలో ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేయడంతో పాటు, జర్నలిస్టుల ఐక్యతను మరింత బలోపేతం చేస్తామని ప్రతినిధులు తెలిపారు.

ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో మీడియా పాత్ర కీలకమని,జర్నలిస్టుల హక్కుల పరిరక్షణకు సమష్టిగా కృషి చేస్తామని నూతన కార్యవర్గ సభ్యులు పేర్కొన్నారు.



## నేడు పెద్దేముల్‌లో ఉచిత కంటి వైద్య శిబిరం

- **పుష్పగిరి ఐ ఫౌండేషన్, ఎల్ఎన్ఆర్ యువసేన ఆధ్వర్యంలో నిర్వహణ**
- **అవసరమైన వారికి ఉచిత కంటి ఆపరేషన్లు, కళ్లద్దాల పంపిణీ**
- **అర్హులైన ప్రజలు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి: లొంక నర్సింహులు**

**పెద్దేముల్,అక్టోబర్ 25(ప్రజాక్షేత్రం):**



ప్రజలకు మెరుగైన కంటి వైద్య సేవలను అందించాలనే లక్ష్యంతో పెద్దేముల్ మండల కేంద్రంలో నేడు(సోమవారం) ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఎల్ఎన్ఆర్ యువసేన వ్యవస్థాపక అధ్యక్షులు లొంక నర్సింహులు తెలిపారు. పుష్పగిరి ఐ ఫౌండేషన్ సౌజన్యంతో, ఎల్ఎన్ఆర్ యువసేన ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.పెద్దేముల్ మండల కేంద్రంలోని గ్యాస్ గోదాం పక్కన ఈ వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ శిబిరంలో ప్రజలకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించడంతో పాటు, వైద్యుల సూచనల మేరకు అవసరమైన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించనున్నట్లు వెల్లడించారు.అలాగే అవసరమైన వారికి ఉచితంగా కండ్ల అద్దాలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

కంటి సమస్యలతో బాధపడుతున్న పేద, మధ్యతరగతి ప్రజలకు ఈ శిబిరం ఎంతగానో ఉపయోగపడుతుందని లొంక నర్సింహులు తెలిపారు. కంటి చూపు సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. పెద్దేముల్ మండలంతో పాటు పరిసర గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని,శిబిరానికి హాజరై కంటి పరీక్షలు చేయించుకోవాలని ఆయన ఆహ్వానించారు.మరిన్ని వివరాలకు: ఎల్ఎన్ఆర్ యువసేనను ఈ సెల్ : 9010678398 నంబర్‌లో

# జవహర్‌నగర్ డంపింగ్ యార్డును తక్షణమే తొలగించాలి

- **ఈటల రాజేందర్ పాదయాత్రకు అఖిలపక్ష ప్రజా సంఘాల మద్దతు**
- **పేద, అణగారిన వర్గాల ఆరోగ్యాన్ని కాపాడే వరకు పోరాటం: తిప్పారపు లక్ష్మణ్ మాదిగ**

**హైదరాబాద్, అక్టోబర్ 25(ప్రజాక్షేత్రం):**

కాప్రా మండల పరిధిలోని జవహర్‌నగర్ డంపింగ్ యార్డును తక్షణమే తొలగించాలని డిమాండ్ చేస్తూ పర్యావరణ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో హైదరాబాద్ టూరిజం హోటల్‌లో అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ నెల 27న మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ నిర్వహించనున్న పాదయాత్రకు సమావేశం సంపూర్ణ మద్దతు ప్రకటించింది. డంపింగ్ యార్డు తొలగింపు కోసం చేపట్టే ఉద్యమంలో భాగస్వాములవుతామని ప్రజా సంఘాల నాయకులు స్పష్టం చేశారు.
సమావేశానికి ముఖ్య అతిథిగా ఈటల రాజేందర్ పాల్గొనగా, విశిష్ట అతిథిగా ఎంఆర్‌పీఎస్-ఎంఎస్‌పీ జాతీయ నాయకుడు తిప్పారపు లక్ష్మణ్ మాదిగ హాజరయ్యారు.
ఈ సందర్భంగా లక్ష్మణ్ మాదిగ మాట్లాడుతూ.. జవహర్‌నగర్ డంపింగ్ యార్డు పరిసర ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజల్లో సుమారు 80 శాతం మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన పేదలేనని పేర్కొన్నారు. పేదలు, అణగారిన వర్గాలు అధికంగా నివసించే ప్రాంతం కావడంతోనే పాలకులు సమస్యను నిర్లక్ష్యం చేస్తున్నారనే ఆవేదన ప్రజల్లో ఉందన్నారు. చెత్త డంపింగ్ యార్డు కారణంగా దుర్వాసన, దోమలు, ఈగలు, వాయు కాలుష్యం, భూగర్భ జలాల కలుషితం వంటి సమస్యలు ప్రజల ఆరోగ్యంపై ప్రభావం చూపే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

**పేదల ఆరోగ్యంపై నిర్లక్ష్యం తగదు**

చెత్త నిర్వహణ పేరుతో ఒక ప్రాంత ప్రజల జీవన ప్రమాణాలు దెబ్బతినకూడదని లక్ష్మణ్ మాదిగ అన్నారు. డంపింగ్ యార్డు ప్రభావిత ప్రాంతాల్లో నివసించే చిన్నారులు, వృద్ధులు, మహిళలు, కార్మిక కుటుంబాలు కాలుష్య సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ ప్రభుత్వం సమగ్ర అధ్యయనం చేపట్టాలని, కాలుష్య నియంత్రణ చర్యలు తీసుకోవాలని, డంపింగ్ యార్డును తొలగించేందుకు స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు.
అభివృద్ధి ఫలాలు అందరికీ సమానంగా అందాల్సిన సమయంలో పేద, అణగారిన వర్గాలు కాలుష్య భారాన్ని మోయాల్సి రావడం అన్యాయమని అన్నారు. ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ, భవిష్యత్ తరాల భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు.
డంపింగ్ యార్డు తొలగించే వరకు, ప్రభావిత ప్రజలకు న్యాయం జరిగే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని లక్ష్మణ్ మాదిగ స్పష్టం చేశారు. పద్మశ్రీ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో, ఆయన సూచనల మేరకు ప్రజా ఉద్యమంలో ముందుంటామని తెలిపారు. ఈ నెల 27న ఈటల రాజేందర్ చేపట్టనున్న పాదయాత్రకు మద్దతుగా నిలిచి, డంపింగ్ యార్డు సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని వెల్లడించారు.
ఈ సమావేశంలో ఎంఎస్‌పీ రాష్ట్ర నాయకులు కేశపాక రామచంద్ర మాదిగ, టీవీ నరసింహారావు మాదిగ, ఇటుక శ్రీకృష్ణ మాదిగ, కొండ్రపల్లి శివ మాదిగ, వెంకటేశ్వర్లు మాదిగ తదితరులు పాల్గొన్నారు.







## నవంబర్ 7న జరిగే పాలడుగు కృష్ణ స్మారక సభను జయప్రదం చేయండి

- **భారతవిప్లవోద్యమం లో అమరులైనవీరులకు విప్లవ జోహార్లు**
- **నవంబర్ 1నుండి 9వరకు అమరరుల సభలను గ్రామ గ్రామాన విస్తృతంగా జరపండి**
- **అమరవీరుల సంస్మరణ సభల వాల్ పోస్టర్స్ ఆవిష్కరణ**

**కొత్తగూడ అక్టోబర్ 25( ప్రజాక్షేత్రం):**

భారత విప్లవద్యంలో అమరులైన వీరులకు జోహార్లు అర్పిస్తూ నవంబర్ 1 నుండి 9 వరకు గ్రామ గ్రామాన సభలు సమావేశాలను విస్తృతంగా జరపాలని కోరుతూ ఈరోజు స్థానిక సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ కామ్రేడ్ పాలడుగు కృష్ణ స్మారక భవనం ఆవరణం ముందు అమరవీరుల వాల్ పోస్టర్స్ ను ఆవిష్కరించడం జరిగింది.
ఈ సందర్భంగా కామ్రేడ్ సూర్యం,సిపి(ఎంఎల్) న్యూడెమోక్రసీ గూడూరు డివిజన్ కార్యదర్శి మాట్లాడుతూ,భూమి భుక్తి పేద ప్రజల విముక్తి కోసం కొనసాగిన గోదావరి లోయ ప్రతిఘటన పోరాటంలో అమరులైన విప్లవ వీరులకు జోహార్లు అర్పిస్తూ నవంబర్ 1 నుండి 9 వరకు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా గ్రామ గ్రామాన సభలను విస్తృతంగా జరపాలని వారు అన్నారు. అదేవిధంగా నవంబర్ 7న కొత్తగూడ మండల కేంద్రంలో జరుగు కామ్రేడ్ పాలడుగు క్రిష్ణ స్మారక బహిరంగ సభను జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు ఈ యొక్క కార్యక్రమంలో పుల్లన్న, శ్రీశైలం,బూర్కా బ్బుచిరాములు, పూర్ణ చందర్,సోమన్న,ప్రభాకర్ (రాయుడు), నిర్మల,జామ్లా సువర్ణపాక నర్సయ్య,నాగేష్,రాజా,జిట్టబోయిన రామచంద్రు,వినేష్, సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

## ఫామ్‌హౌస్‌లలో అక్రమ మద్యం కలకలం

- **26 లీటర్ల మద్యం, నాలుగు హుక్కా పాట్స్ స్వాధీనం.**

**మొయినాబాద్, అక్టోబర్ 25(ప్రజాక్షేత్రం):**

ఫామ్‌హౌస్‌లలో అక్రమ కార్యకలాపాలపై పోలీసులు కొరడా ఝుళిపించారు. మొయినాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని తోలుకట్ట, సురంగల్ గ్రామాల్లో పలు ఫామ్‌హౌస్‌లపై శనివారం రాత్రి నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో 26 లీటర్ల అక్రమ మద్యం, నాలుగు హుక్కా పాట్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలకు సంబంధించి ఫామ్‌హౌస్‌ల యజమానులు, పార్టీ నిర్వాహకులపై కేసులు నమోదు చేసి తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టారు. చేవెళ్ల డీసీపీ యోగేష్ గౌతమ్, ఏసీపీ కిషన్, మొయినాబాద్ ఎస్‌హెచ్‌ఓ వై. మల్లికార్జున్ రెడ్డి, డీఐ ఉపేందర్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది ఈ తనిఖీలు నిర్వహించారు. తోలుకట్టలోని వన్ వ్యూ ఫామ్‌హౌస్, వనం ఫామ్‌హౌస్, ప్రణవిల్లా ఫామ్‌హౌస్‌లతో పాటు సురంగల్‌లోని జెడ్ ఫామ్‌హౌస్, రాయల్ వుడ్ ఫామ్‌హౌస్‌లను తనిఖీ చేశారు.

**అక్రమ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు**

ఫామ్‌హౌస్‌లు, రిసార్టులు, ఇతర ప్రాంతాల్లో చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసు అధికారులు హెచ్చరించారు. ప్రజల భద్రతకు విఘాతం కలిగించే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు.



## పట్టభద్రుల ఓటు నమోదుపై ప్రత్యేక దృష్టి

- **36 శాతమే నమోదు..**
- **అర్హులందరూ ఓటర్లుగా చేరాలి**
- **ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగులను కలిసిన మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి**

**వనపర్తి,అక్టోబరు 25(ప్రజాక్షేత్రం):**

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు నమోదు శాతాన్ని పెంచేందుకు మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అర్హులైన పట్టభద్రులందరూ ఓటర్లుగా నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఇప్పటివరకు 36 శాతం మందే నమోదు చేసుకోవడం ఆందోళన కలిగిస్తోందని, యువత చొరవ తీసుకుని ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావాలని కోరారు. ఆదివారం వనపర్తి పట్టణంలోని పలు వ్యాపార సముదాయాల్లో పర్యటించి ప్రైవేటు ఉద్యోగులను కలిశారు.

**దరఖాస్తుల పంపిణీ.. ధ్రువపత్రాలపై అవగాహన**

పట్టణంలోని బజాజ్ ఎలక్ట్రానిక్స్, కాసం అన్‌లిమిటెడ్, గరుడ, ట్రెండ్స్, చందన బ్రదర్స్, బి ఫిట్ రెడీమేడ్ దుకాణాల్లో పనిచేస్తున్న పట్టభద్రులను నిరంజన్‌రెడ్డి కలుసుకున్నారు. ఓటరు నమోదు దరఖాస్తులను అందజేసి, నమోదు విధానం, సమర్పించాల్సిన ధ్రువపత్రాల గురించి వివరించారు. పట్టభద్రుల ఓటు నమోదు వంద శాతం జరిగేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ప్రభుత్వ నిర్లక్ష్యం, అవగాహన లోపం కారణంగా నమోదు శాతం తక్కువగా ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రైవేటు ఉద్యోగులు ఆయనను సాదరంగా ఆహ్వానించి సన్మానించారు. పలువురు యువతీ యువకులు సెల్ఫీలు దిగారు.

**ఆసుపత్రిలో బాధితుడికి పరామర్శ**

వనపర్తి పట్టణంలోని దళితవాడకు చెందిన రాజేష్ మెదడులో కణితికి శస్త్ర చికిత్స చేయించుకుని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కుటుంబ సభ్యుల సమాచారం మేరకు నిరంజన్‌రెడ్డి ఆసుపత్రికి వెళ్లి ఆయనను పరామర్శించారు. మెరుగైన వైద్యసేవలు అందించాలని విధుల్లో ఉన్న వైద్యులను కోరారు.

**అంకూర్‌లో శుభకార్యానికి హాజరు**

వనపర్తి మండలం అంకూర్ గ్రామ మాజీ సర్పంచి విష్ణువర్ధన్‌రెడ్డి సోదరుడు మధుసూదన్‌రెడ్డి కుటుంబంలో నిర్వహించిన పుట్టు చీర, పుట్టు పంచె వేడుకకు నిరంజన్‌రెడ్డి హాజరయ్యారు. చిన్నారులు యస్విత, మాణిక్‌రెడ్డిలకు అక్షింతలు వేసి ఆశీర్వదించారు. కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమాల్లో మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ వాకిటి శ్రీధర్,గంధం పరంజ్యోతి ,కే.మాణిక్యం,గట్టు యాదవ్,చిట్యాల రాము, గంధం విజయ్‌కుమార్,సయ్యద్ జమీల్,గొర్ల బాలయ్య, మాధవరెడ్డి,డేగ మహేశ్వర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## రైతన్నల కోసం జరిగే నీటి పోరాటాలకు ప్రజలు మద్దతు ఇవ్వాలి

- **రాచకొండ లిఫ్ట్ ఇరిగేషన్ నిర్మించి రాచకొండ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయాలి**
- **దశాబ్దాలు గడుస్తున్న మునుగోడు ప్రాంతానికి నీళ్లేవీ**
- **ప్రభుత్వాలు మారుతున్న ఎమ్మెల్యేలు మారుతున్న ప్రాజెక్టులు మాత్రం పూర్తి కావడం లేదు**
- **ఎన్నికలప్పుడు హామీలే తప్ప ఈ ప్రాంతానికి మాత్రం నీళ్లు లేవు**
- **ప్రాజెక్టు త్వరగా పూర్తి చేయండి ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి**

**సంస్థాన్ నారాయణపురం, (ప్రజాక్షేత్రం):**





మునుగోడు నియోజకవర్గానికి సాగునీటి వనరులు లేకపోవడం పెద్ద లోటుగా మారింది,మునుగోడు నియోజకవర్గంలో రైతులు పంటలు పండించాలంటే వర్షాల పైనే ఆధారపడాల్సిన పరిస్థితి ఉంది. నల్గొండ జిల్లాలోని మిగిలిన ప్రాంతాలతో పోలిస్తే మునుగోడు నియోజకవర్గం లో ఇక్కడి ప్రాజెక్టులు చర్లగూడెం రిజర్వాయర్, కిష్టంపల్లి రిజర్వాయర్, మరియు శివన్నగూడెం రిజర్వాయర్ పనులు ఇంకా పూర్తిగా ముగియలేదు. నీళ్లు, నిధులు, నియామకాలు అన్న నినాదంతో ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం తెచ్చుకున్న ఇక్కడికి ప్రాంతానికి మాత్రం నీళ్లు లేకపోవడంతో మునుగోడులో దారుణమైన పరిస్థితి ఏర్పడింది. ఇక్కడి రైతుల దశాబ్దాల కలను సాకారం చేయాలంటే ఎండిన భూములకు జీవం పోసేందుకు ఏదుల ప్రాజెక్ట్ నుండి శివన్నగూడెం రిజర్వాయర్‌కు నీటిని తరలించే నిర్మాణ పనులు చేపట్టాలని గుజ్జ గ్రామ ఉపసర్పంచ్ ఎలిజాల శ్రీను ప్రభుత్వాన్ని కోరారు. దశాబ్దాలుగా ప్రభుత్వాలు మారుతున్న ఫ్లోరైడ్ రహిత ప్రాంతంగా మార్చడానికి, కృష్ణమ్మ మంచి నీళ్లతో ప్రతి ఇంటి దాహార్తిని తీర్చడానికి ఇక్కడ ఎమ్మెల్యేలు విఫలమయ్యారని అన్నారు. రైతన్నల కోసం చేసే పోరాటలకు ప్రజలు మద్దతు నివ్వాలని పిలుపునిచ్చారు.
దశాబ్దాలుగా నత్తనడకన సాగుతున్న ప్రాజెక్టు పనులపై స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించి నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఈ సందర్భంగా కోరారు. పచ్చని పొలాలతో కళకళలాడాల్సిన రాచకొండ ప్రాంతం నియోజకవర్గంలో కృష్ణమ్మ జలాలు లేక బీడు భూములుగా మారే పరిస్థితి వచ్చే అవకాశం ఉంటుందని శివన్నగూడెం ప్రాజెక్టును నిర్మించి దీని ద్వారా రాచకొండలో కూడా లిఫ్ట్ ఇరిగేషన్ నిర్మించి దీని ద్వారా వేలాది ఎకరాలకు సాగునీరు అందడమే కాకుండా, మునుగోడు నియోజకవర్గంలో ఫ్లోరైడ్ నీటి సమస్య మరియు తాగునీటి ఎద్దడి తీరనుంది,గత ప్రభుత్వాలు ఇక్కడ గెలిచిన ఎమ్మెల్యేలు ఎలక్షన్లలో హామీలకే పరిమితమవుతున్నారు తప్ప ఫ్లోరైడ్ పీడిత ప్రాంతమైన తమ మునుగోడు భవిష్యత్తును మార్చే విధంగా ఏదుల జలాలను శివన్నగూడెం వైపు మళ్లించే పనుల అమలులో విఫలమవుతున్నారు. ఇప్పటికైనా మునుగోడు నియోజకవర్గంలోని ప్రజలు శివన్న గూడెం రిజర్వాయర్ కోసం జరిగే పోరాటాలకు ప్రజలు మద్దతు నివ్వాలని పిలుపునిచ్చారు ఎలిజాల శ్రీను, ఈ కార్యక్రమంలో బొద్దుల సాంబ శివ, సిలువేరు సతీష్, శ్రీపతి సమర సింహ రెడ్డి, సిలివేరు శివ పాల్గొన్నారు.

# ఓటు చోరీపై సమరశంఖం!

- **నవంబరు 1న ఢిల్లీలో మహాధర్నా**
- **జిల్లా నుంచి 300 మంది తరలింపు..**
- **పార్టీ శ్రేణులకు డీసీసీ చీఫ్ శివసేన రెడ్డి పిలుపు**
- **పట్టభద్రుల ఓటరు నమోదుపై ప్రత్యేక దృష్టి..**
- **కరువుపై బీఆర్ఎస్ ప్రచారాన్ని తిప్పికొట్టాలని**
- **ఎమ్మెల్యే మేఘారెడ్డి సూచన**

**వనపర్తి,అక్టోబరు 25 (ప్రజాక్షేత్రం):**




ఓటు హక్కు పరిరక్షణ,ప్రజాస్వామ్యాన్ని కాపాడటమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ పోరాటానికి సిద్ధమైంది. ఓటర్ల జాబితాలో అక్రమాలపై నిరసనగా నవంబరు 1న ఢిల్లీలో నిర్వహించనున్న మహాధర్నాకు వనపర్తి జిల్లా నుంచి 300 మంది నాయకులు,కార్యకర్తలు తరలివెళ్లనున్నట్లు డీసీసీ అధ్యక్షుడు శివసేన రెడ్డి తెలిపారు. కేంద్రంలోని భాజపా ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో నిర్వహించిన జెండా ఆవిష్కరణ, విలేకరుల సమావేశం, జిల్లా కార్యవర్గ సమీక్షలో ఆయన మాట్లాడారు.

**ఓటర్ల హక్కులకు భంగం కలిగితే సహించం**

ప్రజాస్వామ్యానికి ఓటు హక్కే పునాది అని శివసేన రెడ్డి పేర్కొన్నారు. అర్హులైన ఓటర్ల పేర్లను జాబితా నుంచి తొలగిస్తున్నారనే ఆరోపణలపై ఎన్నికల సంఘం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సంఘం భాజపాకు అనుకూలంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. 'ఓట్ బచావో.. దేశ్ బచావో' నినాదంతో కాంగ్రెస్ దేశవ్యాప్తంగా పోరాటం సాగిస్తోందన్నారు. రాహుల్‌గాంధీ ఓటు చోరీ అంశంపై ప్రజెంటేషన్ ద్వారా వివరాలు వెల్లడించారని గుర్తుచేశారు. ఢిల్లీలో జరిగే మహాధర్నాను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

**పట్టభద్రుల నమోదుకు లక్ష్యాలు**

రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని శివసేన రెడ్డి సూచించారు. ప్రతి మండలం నుంచి 500 మంది పట్టభద్రులను, ప్రతి మున్సిపాలిటీ పరిధిలో 800 నుంచి 1,000 మందిని ఓటర్లుగా నమోదు చేయించాలని లక్ష్యాలు నిర్దేశించారు. గ్రామ, మండల స్థాయిల్లో పార్టీ కమిటీల ఏర్పాటును పూర్తి చేయాలని, స్థానిక సమస్యలను గుర్తించి నివేదికలు అందించాలని ఆదేశించారు. పార్టీ సమావేశాలు, కార్యక్రమాల వివరాలను ఫొటోలతో సహా జిల్లా కార్యాలయానికి పంపాలని స్పష్టం చేశారు. వచ్చే నెలలో జిల్లా కాంగ్రెస్ కార్యాలయ భూమిపూజ నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

**కరువుపై బీఆర్ఎస్ ప్రచారం హాస్యాస్పదం**

ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మాట్లాడుతూ కేంద్రంలోని భాజపా ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో వైఫల్యాలను ప్రజలకు వివరించాలని కాంగ్రెస్ శ్రేణులకు సూచించారు. తెలంగాణలో కరువు పరిస్థితులపై బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న ప్రచారం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు. వాస్తవ పరిస్థితులను ప్రజలకు వివరించి, రాజకీయ ప్రయోజనాల కోసం చేసే ప్రచారాన్ని తిప్పికొట్టాలన్నారు. కరువు పరిస్థితుల్లో ఉపాధి కల్పన, తాగునీటి పొదుపు, పశుసంపద సంరక్షణపై దృష్టి సారించాలని సూచించారు. ప్రజా సమస్యలపై రాజకీయాలు చేయడం కంటే ప్రజలకు అండగా నిలవడమే ముఖ్యమన్నారు.

**సేవాదళ్ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ**

సేవాదళ్ ఆధ్వర్యంలో ప్రతి నెల చివరి ఆదివారం నిర్వహించే జాతీయ జెండా ఆవిష్కరణలో భాగంగా పార్టీ కార్యాలయ ఆవరణలో ఎమ్మెల్యే మేఘారెడ్డితో కలిసి శివసేన రెడ్డి జెండాను ఆవిష్కరించారు. మహాత్మాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రజాసేవలో ముందుండాలని సేవాదళ్ కార్యకర్తలకు సూచించారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతోపాటు గ్రామస్థాయి నుంచి కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమాల్లో ఏఐసీసీ నేత, ఉమ్మడి జిల్లాల 'ఓట్ బచావో.. దేశ్ బచావో' పరిశీలకుడు రవీంద్రదాస్,నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి సిద్ధేశ్వర్, ఇతర జిల్లా నాయకులు,వివిధ మండలాల అధ్యక్షులు,సేవాదళ్ ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## సకాలంలో స్పందించిన 108 సిబ్బంది..గాంధీ ఆస్పత్రికి తరలింపు

- **వంటింట్లో పేలుడు..బాధితుడికి ప్రాణాపాయం!**
- **సిలిండర్ పేలిందా.. కుక్కర్ ఒత్తిడి కారణమా?**

**కుత్బుల్లాపూర్,అక్టోబర్ 25 (ప్రజాక్షేత్రం):**

వంటింట్లో ఒక్కసారిగా పేలుడు.. క్షణాల్లో కలకలం! సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలోని సాయిబాబా నగర్‌లో చోటుచేసుకున్న ఈ ఘటనలో ఒడిశా రాష్ట్రానికి చెందిన నర్ బహదూర్ (45) తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడిని 108 అంబులెన్స్ సిబ్బంది సకాలంలో గాంధీ ఆస్పత్రికి తరలించారు.
స్థానికుల సమాచారం ప్రకారం.. ఇంట్లో వంట గ్యాస్‌పై ప్రెషర్ కుక్కర్ పెట్టి నిద్రపోయిన సమయంలో ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. ఒక్కసారిగా భారీ శబ్దంతో పేలుడు సంభవించడంతో చుట్టుపక్కల వారు ఉలిక్కిపడ్డారు. ఘటన సమయంలో ఇంట్లో బాధితుడు ఒక్కడే ఉన్నట్లు సమాచారం.
అసలు పేలుడుకు కారణమేంటి? ప్రెషర్ కుక్కర్‌లో అధిక పీడనమా? గ్యాస్ సిలిండర్‌లో సాంకేతిక లోపమా? అన్నది ఇంకా స్పష్టతకు రాలేదు. పేలుడుకు గల కారణాలపై అధికారిక నిర్ధారణ రావాల్సి ఉంది. సమాచారం అందుకున్న వెంటనే స్పందించిన 108 సిబ్బంది ఈఎంటీ స్వామి, పైలట్ భీమ్‌రావు బాధితుడిని ఆస్పత్రికి తరలించడంలో కీలకంగా వ్యవహరించారు. వంటింట్లో నిర్లక్ష్యం ఎంతటి ప్రమాదానికి దారితీస్తుందో ఈ ఘటన మరోసారి గుర్తుచేస్తోంది. అయితే,ప్రమాదానికి అసలు కారణం విచారణలో తేలాల్సి ఉంది.



# అక్రమ ఇసుక రవాణాకు రెవిన్యూ, మైనింగ్ అధికారులు వత్తాసు

- **శివసాగర్ ప్రాజెక్టు, విశ్వ నాథ్ పూర్ గ్రామం నుండి అక్రమ ఇసుక దోపిడీ!**
- **అనుమతి లేని అక్రమ ఇసుక టిప్పర్లు అడ్డుకుంటాం.**
- **స్థానిక రైతుల ఆవేదన.**
- **కేవీపీస్ ప్రజాసంఘాల డిమాండ్.**

**యాలాల,అక్టోబర్ 25(ప్రజాక్షేత్రం):**

యాలాల మండలం లోని శివసాగర్ ప్రాజెక్టు, విశ్వనాథ్ పూర్ గ్రామాల నుండి అనుమతుల పేరిట టిప్పర్ల ధ్వార అక్రమ ఇసుక రవాణా కొనసాగుతున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదని స్థానిక రైతులు వాపోతున్నారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలి మల్కయ్య, ప్రజా సంఘాల నాయకులు విలేకరుల తో ఆదివారం మాట్లాడరు. సందర్భంగా కేవీపీస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలి మల్కయ్య మాట్లాడుతూ ఒక వైపు ఎల్ నినోతో అడుగంటిన జలాశయాలు మరోవైపు అధికారుల మామూళ్ల మత్తు రైతుల తీవ్ర ఆవేదన.

యాలాల మండలంలోని చారిత్రాత్మక శివ సాగర్ విశ్వ నాథ్ పూర్ వాగు లో అక్రమ ఇసుక దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా విరాజిల్లుతోంది.మండల తహ సీల్దార్ సమక్షంలోనే జేసీబీలతో ఇసుకను తొవ్వి,టిప్పర్ల ద్వారా యథేచ్ఛగా సరిహద్దులు దాటిస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు.మైన్స్, రెవెన్యూ,మరియు పోలీస్ అధికారులు మామూళ్ల మత్తులో ఊగుతూ ఈ అక్రమ రవాణాకు బాహాటంగానే సహకరిస్తున్నారని స్థానిక రైతులు మండిపడుతున్నారు.

**బోరు బావుల్లో నీరు అడుగంటిపోతున్న వైనం**

ఒకవైపు ఎల్ నినో ప్రభావంతో వర్షాలు పడక, చెరువుల్లో నీరు లేక రైతాంగం పంటలను కాపాడుకోవడానికి తీవ్రంగా అల్లలాడుతోంది. ఇలాంటి సంక్షోభ సమయంలో శివసాగర్ నుండి అక్రమంగా వేల టన్నుల ఇసుకను తోడేస్తుండటంతో భూగర్భ జలాలు పూర్తిగా పడిపోతున్నాయి. చెరువు చుట్టుపక్కల రైతులు వేసుకున్న బోరు మోటార్లు ఎండిపోయి, పంటలు ఎండిపోయే ప్రమాదం ఏర్పడింది.కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన చెరువును ఇసుక అక్రమార్కులకు తాకట్టు పెట్టడం దారుణం.

**ప్రభుత్వం, అధికారుల వైఫల్యంతో**

ప్రజాధనానికి, ప్రకృతి వనరులకు రక్షణగా నిలవాల్సిన రెవెన్యూ, పోలీస్,మైన్స్ శాఖల అధికారులు అక్రమార్కులతో చేతులు కలిపి వేల రూపాయల మామూళ్లకు కక్కురుత్తి పడుతున్నారు. కళ్ల ముందే జేసీబీలు, టిప్పర్లు తిరుగుతున్నా చర్యలు తీసుకోకపోవడం చూస్తుంటే ప్రభుత్వ పర్యవేక్షణ ఎంత అధ్వాన్నంగా ఉందో అర్థమవుతోంది. రైతు సంక్షేమం అని ఉపన్యాసాలు దంచే ప్రభుత్వం, క్షేత్రస్థాయిలో రైతుల గొంతు కోస్తున్న ఇసుక మాఫియాను ఎందుకు అరికట్టలేకపోతోంది.

శివసాగర్ చెరువులో తక్షణమే ఇసుక తోడుకాన్ని ఆపివేసి, అక్కడ ఉపయోగిస్తున్న జేసీబీలు, టిప్పర్లను సీజ్ చేయాలి.

అక్రమ రవాణాకు ప్రత్యక్షంగా,పరోక్షంగా సహకరిస్తున్న మండల తహసీల్దార్ సహా మైన్స్, పోలీస్ అధికారులపై కఠిన శాఖా పరమైన మరియు చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. ఎల్ నినో ప్రభావంతో అల్లలాడుతున్న రైతులకు తక్షణమే నీటి రక్షణ కల్పించి,భూగర్భ జలాలను కాపాడేలా చర్యలు చేపట్టాలి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి శివసాగర్ లో అక్రమ ఇసుక రవాణాను అరికట్టకపోతే,కేవీపీస్, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పరిసర ప్రాంత రైతులందరినీ ఏకం చేసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరిస్తున్నాము.ఈ కార్యక్రమం లో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు యు.బుగ్గప్ప,ఎంఆర్ పిఎస్ జిల్లా నాయకులు మహేందర్, రైతులు గుర్రాల నర్సింహా రెడ్డి, పీర్నాయి పల్లి రాజేష్ తదితరులు పాల్గొన్నార.



# భువనగిరి అర్బన్ కాలనీకి చెందిన అయ్యప్ప స్వాముల పాదయాత్రలో ఘోర ప్రమాదం

- **తాగుబోతు బైకర్ ఢీకొని కుటుంబ పెద్ద దుర్మరణం!**

**యాదాద్రి భువనగిరి, అక్టోబర్ 25(ప్రజాక్షేత్రం):**

అయ్యప్ప స్వామిని దర్శించుకునేందుకు ఎంతో భక్తిశ్రద్ధలతో పాదయాత్రగా వెళ్తున్న అయ్యప్ప స్వాముల బృందంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. మద్యం మత్తులో వాహనం నడిపిన ఓ వ్యక్తి నిర్లక్ష్యానికి ఒక నిరుపేద కుటుంబంలో వెలుగులు ఆరిపోయాయి. ఈ ఘోర రహదారి ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు ఔషాపూర్ ప్రాంతంలో అయ్యప్ప స్వాములు నియమనిష్టలతో పాదయాత్ర చేసుకుంటూ వెళ్తుండగా, వెనుక నుంచి అతివేగంగా వచ్చిన ఫ్యాషన్ ప్రో బైక్ స్వాములను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో టెంట్ హౌస్‌లో రోజువారీ కూలీగా పనిచేసే తుర్రి సుధాకర్ తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే కన్నుమూశారు. ఆయనతో పాటు నడుస్తున్న మరో స్వామికి తీవ్ర గాయాలయ్యాయి.

ప్రమాదానికి కారణమైన వ్యక్తిని ఘట్కేసర్, గాంధీనగర్ వీధికి చెందిన మహంకాళి నవీన్ గా గుర్తించారు. NFC నగర్‌లో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్న నవీన్, ఘటన సమయంలో తప్పతాగి మద్యం మత్తులో తీవ్ర వేగంతో బైక్ నడిపి ఈ దారుణానికి ఒడిగట్టినట్లు తేలింది.

ఈ ఘటనపై కేసు నమోదు చేసిన ఘట్కేసర్ పోలీసులు FIR నిందితుడు నవీన్‌పై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటున్నారు.

**అనాథలైన చిన్నారులు..**

**కన్నీరుమున్నీరవుతున్న కుటుంబం:**

మృతి చెందిన సుధాకర్ ది అత్యంత నిరుపేద కుటుంబం. రెక్కాడితే కానీ డొక్కాడని పరిస్థితిలో, టెంట్ హౌస్‌లో డైలీ కూలీగా పనిచేస్తూ తన కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. సుధాకర్‌కు భార్య సంధ్యారాణి ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. అంతేకాకుండా ఆయనపై నలుగురు అక్కచెల్లెళ్ల బాధ్యత కూడా ఉంది. కుటుంబానికి ఒక్కడే ఆధారమైన సుధాకర్ దారుణంగా ప్రాణాలు కోల్పోవడంతో ఆ కుటుంబం దిక్కుతోచని స్థితిలో పడింది. తండ్రి ఇక లేడన్న నిజం తెలియక ఆ చిన్న పిల్లలు ఏడుస్తున్న తీరు స్థానికులను తీవ్రంగా కలిచివేస్తోంది.

మద్యం మత్తులో వేరొకరు చేసిన తప్పుకు ఏ పాపమూ ఎరుగని ఒక నిరుపేద కుటుంబం రోడ్డున పడింది. సంపాదిచే వ్యక్తి లేక అనాథలుగా మారిన సుధాకర్ చిన్న పిల్లల భవిష్యత్తును, భార్య సంధ్యారాణిని ప్రభుత్వం తక్షణమే మానవీయ కోణంలో స్పందించి ఆర్థికంగా ఆదుకోవాలని బాధిత కుటుంబానికి తగిన పరిహారం అందించి న్యాయం చేయాలని స్థానికులు,అయ్యప్ప స్వాములు తీవ్రంగా విజ్ఞప్తి చేస్తున్నారు.



# "కుటుంబం కోసం కష్టపడుతూ.. కరెంటు రూపంలో కబళించిన మృత్యువు!"

- **బోర్ మోటారు వైరును సరిచేస్తుండగా ప్రమాదం..అన్న తింసాన్ పల్లి బిచ్చప్ప (38) మృతి, తమ్ముడు అశోక్ (33) కి తీవ్ర గాయాలు**
- **కళ్లముందే కుప్పకూలిన అన్న.. కాపాడుకునే అవకాశం లేక తమ్ముడి ఆర్తనాదం**
- **భార్య, ఇద్దరు పిల్లలకు తీరని శోకం.. బిచ్చప్ప మృతితో గోపాల్ పూర్ లో విషాదఛాయలు**

**పెద్దేముల్,అక్టోబర్ 25, (ప్రజాక్షేత్రం):**









కుటుంబాన్ని పోషించేందుకు నిత్యం పొలంలో చెమటోడ్చే ఓ యువరైతు..వ్యవసాయ పనులే చేస్తూ ప్రాణాలు కోల్పోయాడు.పొలం వద్ద బోర్ మోటారు విద్యుత్ వైరును సరిచేసే క్రమంలో చోటుచేసుకున్న ప్రమాదం ఓ కుటుంబానికి తీరని దుఃఖాన్ని మిగిల్చింది.కళ్లముందే అన్న విద్యుదాఘాతానికి గురై కుప్పకూలడంతో ఏం చేయాలో తెలియక తమ్ముడు తల్లడిల్లిపోయాడు.క్షణాల వ్యవధిలో జరిగిన ఈ విషాదం ఒక నిండు ప్రాణాన్ని బలితీసుకోవడమే కాకుండా, భార్యాపిల్లలకు కుటుంబ పెద్దను దూరం చేసింది.ఈ హృదయవిదారక ఘటన వికారాబాద్ జిల్లా, తాండూరు నియోజకవర్గం, పెద్దేముల్ మండలం గోపాల్ పూర్ గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.

వికారాబాద్ జిల్లా తాండూరు నియోజకవర్గం పెద్దేముల్ మండలం గోపాల్ పూర్ గ్రామానికి చెందిన తింసాన్ పల్లి బిచ్చప్ప (38), ఆయన తమ్ముడు అశోక్ (33) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు.ఈ క్రమంలో ఆదివారం తమ పొలం వద్ద ఉన్న బోర్ మోటారు విద్యుత్ కనెక్షన్‌ను పాత ట్రాన్స్‌ఫార్మర్ నుంచి కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌కు మార్చే ప్రయత్నం చేశారు.బోర్ మోటారు విద్యుత్ వైరు లూజ్‌గా ఉండటంతో దానిని సరిచేసేందుకు అన్నదమ్ములిద్దరూ పనిలో నిమగ్నమయ్యారు.ఈ క్రమంలో తమ్ముడు అశోక్ చెట్టు ఎక్కి వైరును సరిచేసేందుకు ప్రయత్నించగా,కింద ఉన్న బిచ్చప్ప వైర్‌ను బిగించే ప్రయత్నం చేశాడు.అయితే, వైరు గట్టిగా లాగిన సమయంలో బోర్ మోటారుకు సంబంధించిన జీఏ వైరు సమీపంలోని పొలంలో ఉన్న 11 కేవీ విద్యుత్ తీగకు ప్రమాదవశాత్తు తగలడంతో ఒక్కసారిగా విద్యుత్ ప్రవహించింది.దీంతో అన్నదమ్ములిద్దరూ విద్యుత్ షాక్ కి గురయ్యారు .ఈ ప్రమాదంలో బిచ్చప్ప అక్కడికక్కడే మృతి చెందగా, అశోక్ కాలికి తీవ్ర గాయాలయ్యాయి. ఒక్కసారిగా జరిగిన ప్రమాదంతో అశోక్ తీవ్ర ఆందోళనకు గురయ్యాడు.తన పక్కనే కుప్పకూలిన అన్నను కదిలించి చూసినా స్పందన లేకపోవడంతో ఏం చేయాలో తెలియని పరిస్థితి నెలకొంది.క్షణాల క్రితం తనతోపాటు వ్యవసాయ పనుల్లో ఉన్న అన్న ఇక లేడన్న చేదు నిజాన్ని అశోక్ నమ్మలేకపోయాడు.గాయాలతో బాధపడుతూనే గ్రామస్తులకు, కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి సమాచారం అందించాడు. సమాచారం అందుకున్న గ్రామస్తులు,కుటుంబ సభ్యులు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకున్నారు. అనంతరం 108 అంబులెన్స్‌లో వారిని తాండూరు జిల్లా ఆసుపత్రికి తరలించారు. అయితే, అప్పటికే బిచ్చప్ప మృతిచెందడంతో కుటుంబ సభ్యుల ఆశలు ఆవిరయ్యాయి.అన్నదమ్ములిద్దరూ కలిసి పొలం పనులు చేస్తుండగా జరిగిన ఈ ప్రమాదం గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపింది.మృతుడు బిచ్చప్పకు భార్య, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు.కుటుంబ పోషణ కోసం వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్న ఆయన అకాల మరణంతో భార్యాపిల్లల భవిష్యత్తుపై విషాద ఛాయలు కమ్ముకున్నాయి. కుటుంబానికి అండగా నిలవాల్సిన వ్యక్తి ఇలా అకస్మాత్తుగా దూరమవడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.రోజూ పొలంలో కష్టపడుతూ కుటుంబం కోసం శ్రమించిన బిచ్చప్ప.. అదే వ్యవసాయ పనుల క్రమంలో ప్రాణాలు కోల్పోవడం గ్రామస్తులను తీవ్రంగా కలచివేసింది. అన్నను కోల్పోయిన అశోక్‌కు శారీరక గాయాలతోపాటు జీవితాంతం గుర్తుండిపోయే మానసిక వేదన మిగిలింది.ఈ ఘటనపై బిచ్చప్ప తమ్ముడు అశోక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. బిచ్చప్ప మృతితో గోపాల్ పూర్ గ్రామంలో విషాదఛాయలు అలుముకోగా, ఆయన కుటుంబాన్ని ఆదుకోవాలని స్థానికులు ఆకాంక్షిస్తున్నారు.ఈ విద్యుత్ ప్రమాదంతో ఓ కుటుంబం పెద్దదిక్కును కోల్పోయింది.ఇప్పటికైనా విద్యుత్ అధికారులు ఆయా గ్రామాల రైతులు వివిధ రకాల విద్యుత్ సమస్యలపై ఫోన్ లు చేస్తే ఆ రైతుల విద్యుత్ కష్టాలను, సమస్యలను వెంటనే స్పందించి పరిష్కరిస్తే మృతుడు తింసాన్ పల్లి బిచ్చప్ప లాంటి యువ రైతులను ఎంతోమందిని కాపాడుకోవచ్చని ఆయా గ్రామాల రైతులు అభిప్రాయపడుతున్నారు.



# ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలి

- **అర్హులైన పట్టభద్రులు, ఉపాధ్యాయులు ఫారం-18 ద్వారా నమోదు చేసుకోవాలి**
- **బీజేపీ నాయకులు పెరమోని నరేష్ యాదవ్.**

**మహేశ్వరం,అక్టోబర్ 25 (ప్రజాక్షేత్రం):**



హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి అర్హులైన పట్టభద్రులు ఓటరు నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాలని బీజేపీ జల్‌పల్లి 65వ డివిజన్ నాయకులు పెరమోని నరేష్ యాదవ్ పిలుపునిచ్చారు..ఓటరు నమోదు ప్రక్రియలో అర్హులైన ప్రతి ఒక్కరూ పాల్గొని తమ ప్రజాస్వామ్య హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మామిడిపల్లిలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయులు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వానికి వినతిపత్రాలు అందజేయడంతో పాటు, ప్రజాస్వామ్యబద్ధంగా తమ హక్కులను వినియోగించుకోవాలని సూచించారు. అర్హులైన పట్టభద్రులు సంబంధిత ఎమ్మెల్సీ నియోజకవర్గ ఓటరు జాబితాలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గానికి అర్హులైన వారు సంబంధిత నిబంధనల ప్రకారం దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమని, ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో ఓటు ఒక ముఖ్యమైన సాధనమని పేర్కొన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు తమ సమస్యల పరిష్కారం కోసం సంఘటితంగా, రాజ్యాంగబద్ధమైన మార్గాల్లో కృషి చేయాలని కోరారు.

ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు సంబంధించిన అర్హతలు, దరఖాస్తు విధానం, అవసరమైన పత్రాలు, చివరి తేదీ వంటి వివరాలను అధికారికంగా నిర్ధారించుకుని దరఖాస్తు చేసుకోవాలని పెరమోని నరేష్ యాదవ్ సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు నమోదుపై అవగాహన పెంచుకుని, ప్రజాస్వామ్య ప్రక్రియలో చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు.



# మహేశ్వరం అభివృద్ధిలో మరో ముందడుగు

- **డ్రైవెన్ అర్బన్ హెవెన్ రెసిడెన్షియల్ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిన సబితా ఇంద్రారెడ్డి**

**మహేశ్వరం,అక్టోబర్25 (ప్రజాక్షేత్రం):**

మహేశ్వరం మండల కేంద్రంలో నూతన రెసిడెన్షియల్ ప్రాజెక్టుల నిర్మాణానికి మరో ముందడుగు పడింది. మహేశ్వరం పట్టణంలోని మన్సాన్‌పల్లి రోడ్డులో ఉన్న స్మార్ట్ సిటీ వెంచర్ లో నూతనంగా నిర్మించనున్న డ్రైవెన్ అర్బన్ హెవెన్ రెసిడెన్షియల్ ప్రాజెక్టుకు మాజీ మంత్రివర్యులు,డిప్యూటీ ఫ్లోర్ లీడర్,మహేశ్వరం నియోజకవర్గ శాసనసభ్యురాలు శ్రీమతి పి. సబితా ఇంద్రారెడ్డి శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా ప్రాజెక్టు నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టి, నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేశారు. మహేశ్వరం పట్టణం, పరిసర ప్రాంతాల్లో పెరుగుతున్న నివాస అవసరాలకు అనుగుణంగా నూతన రెసిడెన్షియల్ ప్రాజెక్టులు ఏర్పాటు కావడం అభివృద్ధి పరంగా ప్రాధాన్యతను సంతరించుకుంటోంది. పట్టణ ప్రాంతాల్లో నివాస సదుపాయాలు, మౌలిక వసతులు, రవాణా సౌకర్యాలకు ప్రాధాన్యత పెరుగుతున్న నేపథ్యంలో ఇటువంటి ప్రాజెక్టులు స్థానిక ప్రాంత అభివృద్ధికి తోడ్పడే అవకాశం ఉంది.

మహేశ్వరం మండల కేంద్రం హైదరాబాద్‌కు సమీపంలో ఉండటంతో పాటు, వివిధ ప్రాంతాలకు రాకపోకలకు అనుకూలంగా ఉండటం వల్ల నివాస, వాణిజ్య రంగాల్లో అభివృద్ధికి అవకాశాలు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో మహేశ్వరం పట్టణంలో కొత్త నివాస ప్రాజెక్టుల నిర్మాణం స్థానికంగా మౌలిక సదుపాయాల అభివృద్ధికి, నిర్మాణ రంగానికి మరింత ప్రోత్సాహాన్ని అందించే అంశంగా నిలుస్తోంది. మన్సాన్‌పల్లి రోడ్డులోని స్మార్ట్ సిటీ వెంచర్ లో ఏర్పాటు కానున్న డ్రైవెన్ అర్బన్ హెవెన్ రెసిడెన్షియల్ ప్రాజెక్టు నిర్మాణం ప్రారంభం కావడంతో స్థానిక ప్రాంతంలో కొత్త నివాస సముదాయానికి మార్గం సుగమమైంది. ప్రాజెక్టు నిర్మాణం నిర్ణీత ప్రణాళిక ప్రకారం పూర్తయి, అవసరమైన సదుపాయాలతో అందుబాటులోకి రావాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు.

ఈ శంకుస్థాపన కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజా ప్రతినిధులు, ఇతర ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలు నీటిని పొదుపుగా వాడాలి

- **ఎల్ నినో ప్రభావంతో రాబోయే రోజుల్లో నీటి సమస్య రాకుండా జాగ్రత్త పడాలి**
- **పోతంగల్ సర్పంచ్ కల్లూరి సంధ్యా హనుమాన్లు**
- **ఇంటింటికి తిరిగి నల్ల ట్యాప్ లు పరిశీలించిన సర్పంచ్, గ్రామపంచాయతీ పాలకవర్గం**

**పోతంగల్,అక్టోబర్ 25 (ప్రజాక్షేత్రం):**

ఎల్‌నినో ప్రభావంతో భవిష్యత్తులో నీటి కొరత ఏర్పడే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వినియోగించాలని పోతంగల్ గ్రామ సర్పంచ్ కల్లూరి సంధ్య బజరంగ్ హన్మాండ్లు గ్రామ ప్రజలకు సూచించారు. నీటి వృథాను అరికట్టేందుకు ఆదివారం గ్రామంలోని ప్రతి ఇంటికి తిరిగి నల్లా ట్యాప్‌లను గ్రామపంచాయతీ పాలకవర్గంతో కలిసి ఆమె పరిశీలించారు.ఈ సందర్భంగా సర్పంచ్ కల్లూరి సంధ్య హనుమాన్లు మాట్లాడుతూ నీటి కొరతను నివారించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. ఇంటి నల్లా ట్యాప్‌లకు తప్పనిసరిగా క్యాప్‌లు ఏర్పాటు చేసుకోవాలని, ట్యాప్‌ల నుంచి నీరు వృథాగా కారకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎల్ నినో ప్రభావంతో వర్షాలు కురవకుండా గడ్డు పరిస్థితులు ఏర్పడ్డాయని భవిష్యత్తులో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ఇప్పటి నుంచే నీటిని పొదుపుగా వినియోగించే అలవాటును ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు.నీటి సంరక్షణలో గ్రామ ప్రజలందరూ భాగస్వాములై, అందుబాటులో ఉన్న నీటిని జాగ్రత్తగా వినియోగించాలని ఆమె కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కల్లూరి సంధ్య బజరంగ్ హన్మాండ్లు,ఉపసర్పంచ్ గులాం నబీ,వార్డు మెంబర్లు పంచ రెడ్డి అనిల్, పుల్కంటి సాయిలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# అలయ్ బలయ్ కార్యక్రమంలో పాల్గొన్న రంగన్న

**భువనగిరి,అక్టోబర్ 25 (ప్రజాక్షేత్రం):**

యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరులో శ్రీమతి బండారు శోభారాణి ఆధ్వర్యంలో నిర్వహించిన అలయ్ బలయ్ కార్యక్రమంలో పోరెడ్డి రంగయ్య పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి కేంద్ర మాజీ మంత్రి,హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ,ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్, మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు,ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతా మహేందర్ రెడ్డి,రాష్ట్ర సమాచార హక్కు కమిషనర్ బోరెడ్డి అయోధ్యా రెడ్డి,అరుణోదయ విమలక్క తదితర ప్రముఖులు హాజరయ్యారు. కార్యక్రమానికి పోరెడ్డి రంగయ్య వ్యాఖ్యాతగా వ్యవహరించారు.



# రోడ్డు పనులు పూర్తి చేయాలని రాస్తారోకో

- **ఏళ్లు గడుస్తున్నా పనులు పూర్తి చేయడం లేదని ఆవేదన**
- **దోమలేడ్డి -సుంకిని రోడ్డు వెంటనే పూర్తిచేసేలా చర్యలు చేసుకోవాలని పోచారంను కోరిన గ్రామస్తులు**
- **మొరం టిప్పర్లను అడ్డుకుని రాస్తారోకో చేసిన దోమలేడ్డి గ్రామస్తులు**

**పోతంగల్,అక్టోబర్ 25(ప్రజాక్షేత్రం):**

గతనాలుగేళ్లుగా కొనసాగుతున్న దోమలేడ్డి సుంకిని రోడ్డు పనులు ఏళ్ళు గడుస్తున్నా పూర్తి పూర్తికావడం లేదని పోతంగల్ మండలంలోని దోమలెడ్డి గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డు పనులు వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం గ్రామస్తులు రాస్తారోకో, ధర్నా నిర్వహించారు. గ్రామం మీదుగా చేపట్టిన రోడ్డు పనులు ప్రారంభించి ఏండ్లు గడుస్తున్నా నేటికీ పూర్తికాలేదని అసహనం వ్యక్తం చేశారు. ఈ రోడ్డుపై ఇంటిగ్రేటెడ్ పాఠశాల కొరకు మొరం టిప్పర్లతోపాటు ఇతర వాహనాలు నడుస్తున్నాయని దుమ్ము ధూళితో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నామన్నారు. రోడ్డు అసంపూర్తిగా ఉండటంతో వర్షాకాలంలో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. అత్యవసర పరిస్థితుల్లో రోగులను ఆసుపత్రులకు తరలించాలన్నా ఇబ్బందులు తప్పడం లేదన్నారు. ఇటీవల వర్షాకాలంలో ఓ వ్యక్తిని ఆసుపత్రికి తరలించేందుకు అంబులెన్స్ రావడం ఆలస్యమై, ఆ వ్యక్తి మృతి చెందిన ఘటన చోటుచేసుకుందని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని రోడ్డు పనులు వెంటనే పూర్తి చేయాలని కోరారు. రోడ్డు పనులు అసంపూర్తిగా ఉండటంతో గ్రామ ప్రజలు పడుతున్న ఇబ్బందులను అధికారులు, ప్రజాప్రతినిధులు గుర్తించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని సంబంధిత అధికారులతో మాట్లాడి రోడ్డు పనులను వెంటనే పూర్తి చేయించాలని కోరారు. కార్యక్రమంలో శ్రీకాంత్,శివ, దత్తు పటేల్,నరసింహులు, భూమయ్య,లక్ష్మణ్,వెంకటేష్, రాము తదితరులు ఉన్నారు.




# ఉద్యోగ బాధ్యతలు ఓ వైపు.. సినీ రంగంపై మక్కువ మరోవైపు!

- **ADS' షార్ట్‌ఫిల్మ్‌తో సత్తా చాటిన మొరంపల్లి బంజర్ యువ దర్శకుడు శనగ రవీంద్రబాబు**
- **ప్రభుత్వ ఉద్యోగం చేస్తూనే దర్శకుడిగా తనదైన ముద్ర వేసేందుకు అడుగులు..**

**హైదరాబాద్ రవీంద్రభారతిలో ఘనంగా ప్రీమియర్ ప్రదర్శన**

**బూర్గంపహాడ్,అక్టోబర్ 25 (ప్రజాక్షేత్రం):**

కలలు కనడమే కాదు.. వాటిని సాకారం చేసుకునేందుకు నిరంతరం శ్రమిస్తే విజయానికి మార్గం సుగమమవుతుందని నిరూపిస్తున్నారు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం మొరంపల్లి బంజర్‌కు చెందిన యువ దర్శకుడు శనగ రవీంద్రబాబు.ఒకవైపు ప్రభుత్వ ఉద్యోగ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూనే.. మరోవైపు తనలోని సినీ అభిరుచికి పదును పెడుతూ దర్శకుడిగా గుర్తింపు పొందేందుకు ఆయన చేస్తున్న ప్రయత్నం పలువురిని ఆకట్టుకుంటోంది.ఈ క్రమంలో తన దర్శకత్వ ప్రతిభకు అద్దం పట్టేలా '#ADS' పేరుతో షార్ట్‌ఫిల్మ్‌ను రూపొందించి సినీ ప్రియుల ముందుకు తీసుకొచ్చారు.ఈ చిత్ర ప్రీమియర్ ప్రదర్శన ఆదివారం హైదరాబాద్‌లోని ప్రతిష్ఠాత్మక రవీంద్రభారతిలో ఘనంగా జరిగింది.

**ఉద్యోగం చేస్తూనే.. కళకు అంకితం!**

సాధారణంగా ఉద్యోగ జీవితంలో స్థిరపడిన చాలామంది తమ వ్యక్తిగత అభిరుచులకు, సృజనాత్మక ఆలోచనలకు సమయం కేటాయించడం కష్టంగా భావిస్తుంటారు.అయితే రవీంద్రబాబు మాత్రం తన వృత్తి బాధ్యతలకు ఎలాంటి ఆటంకం కలగకుండా, అందుబాటులో ఉన్న సమయాన్ని సినీ రంగానికి కేటాయిస్తూ ముందుకు సాగుతున్నారు.సినిమాపై ఉన్న ఆసక్తిని కేవలం ఆలోచనలకే పరిమితం చేయకుండా,ఆచరణలో పెట్టి '#ADS' షార్ట్‌ఫిల్మ్‌ను తెరకెక్కించడం ఆయన పట్టుదలకు నిదర్శనంగా నిలుస్తోంది.సినిమా నిర్మాణం అనేది కేవలం కెమెరా ముందు కనిపించడమే కాదు.. కథను అర్థవంతంగా మలచడం, ప్రేక్షకుల ఆసక్తిని నిలబెట్టడం, సన్నివేశాలను సమన్వయం చేయడం వంటి అనేక అంశాలతో కూడుకున్న సృజనాత్మక ప్రక్రియ.ఈ నేపథ్యంలో దర్శకుడిగా తన ఆలోచనలను తెరపై ఆవిష్కరించేందుకు రవీంద్రబాబు చేసిన ప్రయత్నం ప్రత్యేకంగా నిలుస్తోంది.

**ADS'తో దర్శకుడిగా తొలి అడుగులు..**

తనకున్న సినీ అభిరుచికి కార్యరూపం ఇస్తూ రవీంద్రబాబు రూపొందించిన '#ADS' షార్ట్‌ఫిల్మ్ ప్రీమియర్ ప్రదర్శన హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించడం ఆయన సినీ ప్రయాణంలో ముఖ్యమైన ముందడుగుగా చెప్పుకోవచ్చు.తన ఆలోచనలను చిత్ర రూపంలో ప్రేక్షకుల ముందుకు తీసుకెళ్లడం ద్వారా దర్శకుడిగా తన ప్రతిభను పరిచయం చేసుకునే వేదికను ఆయన సొంతం చేసుకున్నారు.షార్ట్‌ఫిల్మ్ రూపంలో తన సృజనాత్మకతను చాటుకుంటూ, భవిష్యత్తులో మరిన్ని అవకాశాలను అందిపుచ్చుకునే దిశగా ఆయన అడుగులు వేస్తున్నారు.సినిమా రంగంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించాలనే లక్ష్యంతో సాగుతున్న ఈ ప్రయాణం.. అభిరుచికి కృషి తోడైతే కొత్త అవకాశాలు సృష్టించుకోవచ్చనే సందేశాన్ని అందిస్తోంది.




**పల్లె నుంచి సినీ రంగం వైపు..**
**యువతకు స్ఫూర్తి!**

మొరంపల్లి బంజర్ వంటి గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చిన ఓ యువకుడు ప్రభుత్వ ఉద్యోగాన్ని కొనసాగిస్తూనే సినీ దర్శకత్వంపై ఆసక్తితో ముందుకు సాగడం స్థానికంగా చర్చనీయాంశంగా మారుతోంది.ప్రతిభ ఉన్నప్పటికీ సరైన అవకాశాల కోసం ఎదురుచూస్తున్న యువతకు రవీంద్రబాబు ప్రయాణం ప్రేరణగా నిలుస్తోంది. తమలోని నైపుణ్యాలను గుర్తించి, వాటిని అభివృద్ధి చేసుకుంటూ, క్రమశిక్షణతో ముందుకు సాగితే వృత్తి జీవితంతో పాటు వ్యక్తిగత లక్ష్యాలనూ సాధించవచ్చని ఆయన ప్రయత్నం తెలియజేస్తోంది.

**మరిన్ని మంచి చిత్రాలు రావాలి!**

ప్రభుత్వ ఉద్యోగ బాధ్యతలను నిర్వర్తిస్తూనే సినీ రంగంపై తనకున్న మక్కువను కొనసాగిస్తున్న శనగ రవీంద్రబాబు భవిష్యత్తులో మరిన్ని మంచి చిత్రాలను రూపొందించి దర్శకుడిగా ఉన్నత స్థాయికి ఎదగాలని స్థానికులు ఆకాంక్షిస్తున్నారు.తన ప్రతిభతో స్వగ్రామానికి, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కోరుకుంటున్నారు.

# తిరుమల వెంకటేశ్వర స్వామినీ దర్శించుకున్న మాజీ సర్పంచు పోడువు శ్రీనివాస్

**శంకర్ పల్లి అక్టోబర్ 25(ప్రజాక్షేత్రం):**



కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల తిరుపతి వెంకటేశ్వర స్వామివారిని దర్శించుకుని స్వామివారి ఆశీస్సులు పొందిన గోపులారం గ్రామ మాజీ సర్పంచ్ రంగారెడ్డి జిల్లా మాజీ సర్పంచుల సంఘం ప్రధాన కార్యదర్శి పోడువు శ్రీనివాస్ ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ గోపులారం గ్రామ ప్రజలు, శంకర్‌పల్లి మండల ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, పాడిపంటలతో, అష్టైశ్వర్యాలతో చల్లగా ఉండాలని, ప్రతి కుటుంబంపై ఆ ఏడుకొండల వెంకటేశ్వర స్వామి కృపాకటాక్షాలు ఎల్లప్పుడూ ఉండాలని మనస్ఫూర్తిగా ప్రార్థించారు. గోవిందా గోవింద అని, ఏడుకొండల స్వామివారి ఆశీస్సులు అందరికీ ఉండాలని, ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖశాంతులు, సంతోషాలు వెల్లివిరియాలని కోరుకున్నారు.

# బర్త్‌డే పార్టీలో గంజాయి కలకలం!

- **ఫామ్‌హౌస్‌పై పోలీసుల దాడి.. ఒకరికి పాజిటివ్**

**మొయినాబాద్, అక్టోబర్ 25(ప్రజాక్షేత్రం):**

బర్త్‌డే పార్టీ ముసుగులో గంజాయి వినియోగిస్తున్నారన్న సమాచారంతో పోలీసులు ఫామ్‌హౌస్‌పై దాడి చేశారు. ఈ తనిఖీల్లో ఆరుగురు వ్యక్తులు పార్టీ చేసుకుంటున్నట్లు గుర్తించగా, ఐదుగురికి నిర్వహించిన ప్రాథమిక మూత్ర పరీక్షల్లో ఒకరికి గంజాయి వినియోగానికి సంబంధించిన టీహెచ్‌సీ పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. ఈ ఘటన మొయినాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కనకమామిడి గ్రామ శివారులో చోటుచేసుకుంది.

పోలీసుల వివరాల ప్రకారం.. ఈ నెల 24న కనకమామిడి శివారులోని మ్యాంగో వుడ్ ఫామ్‌హౌస్, విల్లా నంబర్ 13లో గంజాయి, మద్యం సేవిస్తూ బర్త్‌డే పార్టీ నిర్వహిస్తున్నారన్న విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో మొయినాబాద్ ఎస్ఐ ఎన్. వెంకన్న సిబ్బందితో కలిసి పంచుల సమక్షంలో ఫామ్‌హౌస్‌పై దాడి నిర్వహించారు. అక్కడ ఆరుగురు వ్యక్తులు పార్టీ చేసుకుంటున్నట్లు గుర్తించారు. వారిలో ఐదుగురికి పరీక్షలు నిర్వహించగా, బీహార్‌కు చెందిన బిషు కుమార్ (25), డ్యాన్స్ టీచర్‌కు టీహెచ్‌సీ పాజిటివ్‌గా వచ్చింది. మిగిలిన నలుగురి పరీక్షల్లో నెగిటివ్‌గా నమోదైంది.విచారణలో బిషు కుమార్ సుమారు ఐదు నెలల క్రితం మనీష్ అనే వ్యక్తి వద్ద గంజాయి కొనుగోలు చేసి వినియోగిస్తున్నట్లు తెలిపాడని పోలీసులు వెల్లడించారు. మనీష్ మొమోస్ విక్రయంతో పాటు గంజాయి విక్రయిస్తున్నట్లు విచారణలో తెలిసిందని పేర్కొన్నారు. అయితే, బర్త్‌డే పార్టీకి తాను గంజాయి తీసుకురాలేదని బిషు కుమార్ చెప్పినట్లు తెలిపారు. తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం అతడిని పోలీస్ స్టేషన్‌కు తరలించి సంబంధిత అధికారులకు అప్పగించారు.



# పొద్దుటూరులో ఉచిత వైద్య శిబిరం... ప్రజలకు వైద్య సేవలు

**శంకర్ పల్లి, అక్టోబర్ 25(ప్రజాక్షేత్రం):**

శంకర్ పల్లి పరిధిలోని పొద్దుటూరు గ్రామంలో ఆదివారం కోకాపేట్ వారి ఈకో ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామ ప్రజలకు వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశ్యంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో పలువురు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో శంకర్‌పల్లి పీఏసీఎస్ చైర్మన్ బొల్లారం వెంకట్ రెడ్డి, గ్రామ సర్పంచ్ బండ లక్ష్మి నరసింహ, ఉపసర్పంచ్ కవేలి గోవర్ధన్ రెడ్డి పాల్గొన్నారు. అలాగే వార్డు సభ్యులు నటల అనిత, రమేష్, కోటి, ప్రశాంత్, బేకర్ సింహం రాజు, ఉమ్మెత్తల శ్వేత, వినోద్ కుమార్, ఎన్కేపల్లి మాధవ్, కోలాన్ రమాదేవి, కావేలి తిరుపతిరెడ్డి, మాజీ సర్పంచ్ సురకంటి శశికాంత్ రెడ్డి, కటిక శ్రీనివాస్ హాజరయ్యారు.గ్రామ పెద్దలు బొల్లారం మోహన్ రెడ్డి, బండ బాలయ్య, పులకండ్ల గోపాల్ రెడ్డి, పట్నం రాజిరెడ్డి, కొండకల్ విష్ణువర్ధన్ రెడ్డితో పాటు గ్రామ యువకులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ....గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు వైద్య సేవలు అందుబాటులో ఉండటం ఎంతో ఉపయోగకరమని, ఇలాంటి సేవా కార్యక్రమాలు ప్రజల ఆరోగ్య పరిరక్షణకు దోహదపడతాయని పలువురు పేర్కొన్నారు.



# దశదిన కర్మకు హాజరైన ఎమ్మెల్యే కాలే యాదయ్య, మాజీ ఎంపీ గడ్డం రంజిత్ రెడ్డి

**శంకర్ పల్లి అక్టోబర్ 25(ప్రజాక్షేత్రం)**

శంకర్‌పల్లి మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బారి వెంకట రామ్ రెడ్డి దశదిన కర్మ కార్యక్రమానికి చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్యతో కలిసి చేవెళ్ల పార్లమెంట్ మాజీ ఎంపీ గడ్డం రంజిత్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వెంకట రాంరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో శంకర్‌పల్లి మున్సిపల్ చైర్మన్ సాత ప్రవీణ్ కుమార్, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ గోపాలరెడ్డి, వైస్ చైర్‌పర్సన్ జూలకంటి శ్వేతా పాండురంగారెడ్డి, మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు మడపతి చంద్రమౌళి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, పీఏసీఎస్ చైర్మన్ బొల్లారం వెంకటరెడ్డి, వైస్ చైర్మన్ పార్శి బాలకృష్ణ, కావలి గోపాల్, కౌన్సెలర్ దండు రాజేశ్వర్, నాయకులు రఘునందన్ రెడ్డి, రాజేశ్వర్ గౌడ్ శంకర్‌పల్లి యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బొల్లారం ప్రశాంత్, పొద్దుటూరు సర్పంచ్ బండ లక్ష్మీనరసింహ పాటు మున్సిపల్, మండల కాంగ్రెస్ నాయకులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



# శంకర్‌పల్లి మున్సిపల్ మూడో వార్డులో పొంగి పొర్లుతున్న డ్రైనేజీ

- **దుర్వాసనతో కాలనీవాసులు నరకయాతన..**
- **ఫిర్యాదు చేసినా పట్టించుకోని మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్**
- **చర్యలు తీసుకోవాలని వార్డు ప్రజల డిమాండ్.**

**శంకర్‌పల్లి అక్టోబర్ 25(ప్రజాక్షేత్రం):**

శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని 3వ వార్డులో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. బద్దం శశిధర్ రెడ్డి ఇంటి ఎదురుగా ఉన్న రోడ్డుపై అండర్ డ్రైనేజీ మురికి నీరు ఉప్పొంగి ప్రవహిస్తోంది. దీంతో ఆ రోడ్డు మొత్తం మురికి నీటితో నిండిపోయి విపరీతమైన దుర్వాసన వెదజల్లుతోంది. ఈ విషయంపై స్థానికులు ఎన్నిసార్లు మున్సిపల్ అధికారులకు, వార్డు కౌన్సిలర్ కు ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మురికి నీరు రోడ్డుపై ప్రవహిస్తుండటంతో కాలనీవాసులు నడవలేక, ఇళ్లలో ఉండలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దోమల బెడద కూడా పెరిగిందని వాపోతున్నారు. వెంటనే మున్సిపల్ అధికారులు స్పందించి డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని 3వ వార్డు కాలనీవాసులు కోరుతున్నారు.





# హక్కుల సాధనకు ఐక్యంగా ముందుకు సాగాలి

- **ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ ముక్కపల్లి రాజు మాదిగ**
- **రాయపోల్ మండలంలో ఎమ్మార్పీఎస్–ఎఎస్పి నూతన కమిటీల ఎన్నిక**

**రాయపోల్, అక్టోబర్ 25(ప్రజాక్షేత్రం):**

కులవివక్ష, సామాజిక అసమానతలు లేని సమసమాజ నిర్మాణమే ఎమ్మార్పీఎస్ లక్ష్యమని ఎమ్మార్పీఎస్ సంఘం సిద్దిపేట జిల్లా కన్వీనర్ ముక్కపల్లి రాజు మాదిగ అన్నారు. ఆదివారం రాయపోల్ మండల కేంద్రంలోని జీఎల్ఆర్ గార్డెన్ హాల్‌లో మండల ఇన్‌చార్జి అయ్యగళ్ల రవి మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎమ్మార్పీఎస్ఎం ఎస్ పి నూతన కమిటీల ఎన్నికల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాదిగల హక్కుల సాధనకు, సామాజిక అసమానతల నిర్మూలనకు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా అయ్యగళ్ల రవి మాదిగ, అధికార ప్రతినిధిగా కొనింటి లక్ష్మణ్ మాదిగ, ప్రధాన కార్యదర్శిగా గుండారం ఎల్లం మాదిగ, ఉపాధ్యక్షుడిగా మద్దూరి యాదగిరి మాదిగను ఎన్నుకున్నారు. అలాగే ఎంఎస్పి మండల అధ్యక్షుడిగా తుడుం నర్సింగరావు మాదిగ, అధికార ప్రతినిధిగా శ్రీనివాస్ మాదిగ, ప్రధాన కార్యదర్శిగా రాముల నాగరాజు మాదిగ ఎన్నికయ్యారు. నూతన కమిటీ సభ్యులకు నియామక పత్రాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి ఇస్తారి గల్ల ఎల్లం మాదిగ, మైస రాములు, పుర నరసింహులు మాదిగ, మల్లుగారి యాదగిరి మాదిగ, గజ్వేల్ రామచంద్రం, రాయపోల్ సర్పంచ్ మాసంపల్లి రాజు, రామ్మోళ స్వామి, అనాజీపూర్ సోమని ఇస్తారి, మంతూర్ ఉపసర్పంచ్ సంతోష్ ఉషనగల స్వామి జర్నలిస్టులు మన్నె గణేష్, ఉషనగల్ల శ్రీనివాస్, ఉషనగళ్ళ నరసింహులు నర్సింగ్ రావు వివిధ వివిధ గ్రామాల ఎంఆర్పిఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.





# కరువుపై అవగాహన కల్పిస్తే తప్పేంటి?

- **నీటి పొదుపు అందరి బాధ్యత.**
- **మోత్కుపల్లి అనిల్ కుమార్.**

**శంకర్ పల్లి, అక్టోబర్ 25(ప్రజా-క్షేత్రం):**



కరోనా సమయంలో ప్రాణభయంతో ఇళ్లకే పరిమితమైన మనం, కరువు ముప్పు పొంచి ఉన్నప్పుడు కూడా అప్రమత్తంగా ఉండాలి. ఎల్నినో ప్రభావంతో వర్షాలు తగ్గే అవకాశం ఉన్న నేపథ్యంలో నీటిని పొదుపుగా వాడుకోవాలి. ఉన్న నీటిని పంటలకు వినియోగిస్తే తాగునీటి కొరత ఏర్పడే ప్రమాదం ఉందని, ప్రజలు పరిస్థితిని అర్థం చేసుకోవాలని చేవెళ్ల నియోజకవర్గ ఎస్సీ సెల్ వైస్ ప్రెసిడెంట్ మోత్కుపల్లి అనిల్ కుమార్ విజ్ఞప్తి చేశారు. నీటి పొదుపును రాజకీయం చేయకుండా బాధ్యతగా వ్యవహరించాలని కోరారు

# టీమిండియాలో ఆడిన ఆనందం నిలవలేదు

- టీమిండియాలో చోటు కోల్పోయాక 18 నెలలు డిప్రెషన్‌లో ఉన్నట్లు వెల్లడి
- కుటుంబానికి చెప్పలేక ఒంటరిగా బాధను అనుభవించానన్న మిశ్రా
- గాడ్‌ఫాదర్ లేకపోవడంతో ప్రదర్శనతోనే నిరూపించుకోవాల్సి వచ్చిందని వ్యాఖ్య
- ఇటీవలే ఢిల్లీ క్యాపిటల్స్ స్పిన్ బౌలింగ్ కోచ్‌గా నియామకం

ప్రజాక్షేత్రం :

టీమిండియా మాజీ స్పిన్నర్ అమిత్ మిశ్రా తన కెరీర్ ఆరంభంలో ఎదుర్కొన్న తీవ్ర మానసిక ఒత్తిడి గురించి సంచలన విషయాలను వెల్లడించాడు. భారత జట్టులో స్థానం కోల్పోయిన అనంతరం దాదాపు 18 నెలల పాటు తాను తీవ్ర కుంగుబాటుకు (డిప్రెషన్) లోనయ్యానని ఆయన తెలిపాడు. ప్రముఖ వ్యాఖ్యాత ఆకాశ్ చోప్రాతో జరిగిన ఒక ఇంటర్వ్యూలో మిశ్రా ఈ విషయాలను పంచుకున్నాడు.

"భారత జట్టుకు ఆడిన సంతోషం నాకు ఎంతో కాలం నిలవలేదు. జట్టులో చోటు కోల్పోవడంతో నా కెరీర్ సందిగ్ధంలో పడింది. నేనేం తప్పు చేశానా? అని నన్ను నేనే ప్రశ్నించుకునేవాడిని. ఆ బాధను పంచుకోవడానికి నాకు ఎవరూ ఉండేవారు కాదు. నా పరిస్థితి చూసి కుటుంబ సభ్యులు ఆందోళన చెందకూడదనే ఉద్దేశంతో వారితో కూడా ఈ విషయాలు చెప్పలేదు. నా జీవితంలోనే అది అత్యంత కష్టమైన కాలం" అని మిశ్రా ఆవేదన వ్యక్తం చేశాడు.

జాతీయ జట్టు నుంచి తొలగించిన తర్వాత, కనీసం దులీప్ ట్రోఫీ లేదా ఇండియాఏ జట్లలో కూడా తనకు అవకాశం దక్కలేదని మిశ్రా గుర్తుచేసుకున్నాడు. ఒక సీజన్‌లో ఆశించిన స్థాయిలో రాణించకపోవడంతో పరిస్థితి మరింత క్లిష్టంగా మారిందని, ఒక సెలక్టర్ 'నువ్వు సరిగా ఆడటం లేదు' అని నేరుగా తన ముఖం మీదే చెప్పారని వివరించాడు. ఆ తర్వాతే తాను కేవలం జాతీయ జట్టు గురించే ఆలోచిస్తూ దేశవాళీ క్రికెట్‌ను విస్మరించానని గ్రహించినట్లు పేర్కొన్నాడు. తదనంతరం బ్యాటింగ్‌పై కూడా దృష్టి సారించి తిరిగి దులీప్ ట్రోఫీలో చోటు సంపాదించానని తెలిపాడు. తనకు ఎలాంటి 'గాడ్‌ఫాదర్' లేనందున, ప్రతిసారీ అత్యుత్తమ ప్రదర్శనతోనే తనను తాను నిరూపించుకోవాల్సి వచ్చిందని స్పష్టం చేశాడు. మిశ్రా ఇటీవల ఐపీఎల్ 2027 కోసం ఢిల్లీ క్యాపిటల్స్ స్పిన్ బౌలింగ్ కోచ్‌గా నియమితుడైన విషయం తెలిసిందే.



# డిసెంబర్‌లో తేల్చేస్తా.. ఐపీఎల్ రీఎంట్రీపై మౌనం వీడిన ధోనీ

- ఐపీఎల్ భవిష్యత్తుపై తొలిసారిగా స్పందించిన ఎంఎస్ ధోనీ
- డిసెంబర్ లోపు తన నిర్ణయాన్ని ప్రకటిస్తానని వెల్లడి
- ఫిట్‌నెస్ పరీక్షల నివేదిక ఆధారంగానే తుది నిర్ణయం ఉంటుందన్న ఎంఎస్
- తన శరీరాన్ని 'పాత వింటేజ్ వాహనం'తో పోల్చిన మహీ
- పిక్క కండరాల గాయంతో 2026 ఐపీఎల్ సీజన్‌కు దూరమైన ధోనీ

ప్రజాక్షేత్రం :

భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్, చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) దిగ్గజం మహేంద్ర సింగ్ ధోనీ.. తన ఐపీఎల్ భవిష్యత్తుపై నెలకొన్న ఉత్కంఠకు తెరదించే ప్రయత్నం చేశాడు. పిక్క కండరాల గాయం కారణంగా 2026 ఐపీఎల్ సీజన్ మొత్తానికి దూరమైన ధోనీ, తన రీఎంట్రీపై తొలిసారిగా స్పందించాడు. తన ఫిట్‌నెస్‌పై డిసెంబర్ లోపు ఒక స్పష్టత వచ్చాక, ఐపీఎల్‌లో కొనసాగడంపై తుది నిర్ణయం తీసుకుంటానని వెల్లడించాడు.

బెంగళూరులో జరిగిన ఓ ఆరోగ్య కార్యక్రమానికి హాజరైన ధోనీని.. మరో సీజన్ ఆడే అవకాశం ఉందా? అని ప్రశ్నించగా.. "డాక్టర్, నేను ముందుగా అన్ని పరీక్షలు చేయించుకోవాలి. మీరు నాకు పూర్తి నివేదిక ఇవ్వాలి. ఆ తర్వాత, డిసెంబర్ లోపు మరో సీజన్ ఆడేంత బలంగా నేను ఉన్నానో లేదో చూసుకోవాలి" అని అన్నాడు.

అంతటితో ఆగకుండా, "ఒకవేళ నేను ఆడలేకపోయే పరిస్థితి వస్తే, ఈ పాత వింటేజ్ వాహనం రోడ్డుపై సరిగ్గా నడిచేలా చూడాల్సిన బాధ్యత మీదే (వైద్యులదే). కాబట్టి ఒత్తిడంతా వారిపైనే ఉంది" అని చమత్కరించాడు.

2027 ఐపీఎల్ నాటికి దాదాపు 46 ఏళ్లకు చేరువకానున్న ధోనీ, తన కెరీర్‌లో 278 ఐపీఎల్ మ్యాచ్‌లలో 38.30 సగటుతో 5,439 పరుగులు సాధించాడు. అతడి సారథ్యంలో చెన్నై సూపర్ కింగ్స్ ఐదుసార్లు ఐపీఎల్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. అయితే, గత రెండు సీజన్లలో రుతురాజ్ గైక్వాడ్ కెప్టెన్సీలో సీఎస్‌కే ప్రదర్శన నిరాశపరిచింది. 2025లో చివరి స్థానంలో నిలవగా, 2026లో ఎనిమిదో స్థానంతో సరిపెట్టుకుంది. ఈ నేపథ్యంలో, ధోనీ ఫిట్‌గా ఉంటే కచ్చితంగా జట్టులో కొనసాగాలని సీఎస్‌కే యాజమాన్యం కూడా ఆశిస్తోంది. డిసెంబర్‌లో మహీ తీసుకోబోయే నిర్ణయం కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



# ఓటరు జాబితాలో అక్రమాలకు తావెందుకు?

- అర్హుల పేర్లు గల్లంతైతే బాధ్యత ఎవరిది? ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణలో ఎన్నికల యంత్రాంగం జవాబుదారీ కావాలి!




ఓటు అడిగే రాజకీయ వ్యవస్థకు ముందు ఓటు హక్కును కాపాడే బాధ్యత ఉండాలి. అర్హుడైన పౌరుడి పేరు ఓటరు జాబితాలో లేకపోతే, ఎన్నికల రోజు అతను ఓటు వేయలేని పరిస్థితి ఏర్పడుతుంది. అందుకే ఓటరు జాబితాలో తప్పులకు తావుండకూడదు. పేర్ల నమోదు, తొలగింపు, సవరణ ప్రక్రియలు పారదర్శకంగా సాగాలి. అర్హుడైన ఒక్క పౌరుడి హక్కు కూడా నిర్లక్ష్యానికి గురికాకూడదు. ఇదే ప్రజాస్వామ్యానికి కనీస ప్రమాణం.

భారత ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు పౌరుడికి అత్యంత కీలకమైన రాజకీయ హక్కు. పాలకులను ఎన్నుకోవడం, వారి పనితీరును అంచనా వేయడం, అవసరమైతే ప్రభుత్వాలను మార్చడం ప్రజలకు ఎన్నికల ద్వారా లభించే అవకాశం. అయితే ఈ హక్కును వినియోగించుకోవాలంటే సంబంధిత ఓటరు జాబితాలో పేరు ఉండాలి. గుర్తింపు కార్డు ఉన్నప్పటికీ జాబితాలో పేరు లేకపోతే సాధారణంగా ఓటు వేయడానికి అనుమతి ఉండదు. అందువల్ల ఓటరు జాబితా నిర్వహణలో జరిగే ప్రతి పొరపాటు ఒక పౌరుడి ప్రజాస్వామ్య భాగస్వామ్యాన్ని ప్రభావితం చేయగలదు.

తెలంగాణలో అక్టోబర్ 15, 16 తేదీల్లో ఓటరు జాబితాలో పేర్లు లేని అర్హుల కోసం ప్రత్యేక శిబిరాలు నిర్వహించాలని ఎన్నికల అధికారులు ఆదేశించినట్లు వార్తలు వెలువడ్డాయి. ఈ చర్య ఉద్దేశం మంచిదే. ముసాయిదా జాబితాలో పేరు కనిపించని అర్హులు దరఖాస్తు చేసుకునేందుకు, అవసరమైన వివరాలను సరిచేసుకునేందుకు ఇలాంటి శిబిరాలు ఉపయోగపడతాయి. కానీ శిబిరాలు నిర్వహించామనే ప్రకటనతో బాధ్యత ముగిసిపోదు. అర్హులైన వారందరికీ సమాచారం చేరిందా? దరఖాస్తులు స్వీకరించారా? వాటిని సకాలంలో పరిశీలించారా? నిజంగా సమస్య ఎదుర్కొంటున్నవారి పేర్లు తుది జాబితాలో చేరాయా? అన్నదే అసలు పరీక్ష.

ఒక శిబిరానికి తక్కువ మంది వచ్చారని ప్రజలకు ఓటు హక్కుపై ఆసక్తి లేదని నిర్ణయించడం తొందరపాటు. సమాచారం అందకపోవడం, పనుల కారణంగా శిబిరానికి రాలేకపోవడం, ఆన్‌లైన్ సేవలను వినియోగించుకోవడం లేదా ఇప్పటికే నమోదు పూర్తవడం వంటి కారణాలు ఉండవచ్చు. అందువల్ల హాజరు సంఖ్యను మాత్రమే విజయానికి కొలమానంగా తీసుకోకుండా, అర్హులైన పౌరుల సమస్యలు ఎంతవరకు పరిష్కరించబడ్డాయో పరిశీలించాలి.

### హక్కుల పరిరక్షణలో రాజీ ఉండకూడదు

భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 326 సార్వత్రిక వయోజన ఓటుహక్కుకు పునాది. చట్టం నిర్దేశించిన అర్హతలు కలిగిన పౌరులు ఓటరు జాబితాలో నమోదు కావడానికి అవకాశం ఉండాలి. కొత్తగా 18 ఏళ్లు నిండిన యువత, నివాసం మారినవారు, గతంలో నమోదు చేసుకోలేకపోయిన అర్హులు ఈ ప్రక్రియలో ప్రత్యేకంగా దృష్టి పెట్టాల్సిన వర్గాలు.

ఓటరు జాబితాను ఖచ్చితంగా ఉంచడం కూడా అంతే ముఖ్యం. మరణించినవారి నమోదులు, చట్టప్రకారం తొలగించాల్సిన పేర్లు, పునరావృత నమోదులు, తప్పుగా ఉన్న వివరాలను నిబంధనల ప్రకారం పరిశీలించాలి. కానీ జాబితా శుద్ధి పేరుతో అర్హుడైన వ్యక్తి పేరు పొరపాటున తొలగిపోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. పేరు తొలగింపునకు సంబంధించిన అభ్యంతరాలు, నోటీసులు, విచారణలు, నిర్ణయాలు వర్తించే చట్టం ప్రకారం జరగాలి. అనుమానం ఒక్కటే తొలగింపునకు ఆధారం కాకూడదు.

ఇక్కడ ఎన్నికల యంత్రాంగం ముందు రెండు బాధ్యతలు ఉన్నాయి. ఒకటి, అర్హులైన పౌరులందరికీ నమోదు అవకాశం కల్పించడం. రెండోది, జాబితాలోని తప్పులను సరిచేయడం. ఒకదానిని నెరవేర్చుతూ మరొకదాన్ని నిర్లక్ష్యం చేయకూడదు. జాబితా ఖచ్చితత్వం పేరుతో అర్హుల హక్కులు దెబ్బతినకూడదు; హక్కుల పరిరక్షణ పేరుతో చట్టబద్ధమైన సవరణలను కూడా అడ్డుకోకూడదు. నిబంధనలను అందరికీ సమానంగా వర్తింపజేయడమే సరైన మార్గం.

### గణాంకాలు బయటపెట్టాలి.. బాధ్యత నిర్ధారించాలి

ప్రత్యేక శిబిరాల నిర్వహణ అనంతరం ఎన్నికల అధికారులు జిల్లాల వారీగా వివరాలు వెల్లడించాలి. ఎన్ని దరఖాస్తులు అందాయి? కొత్త ఓటరు నమోదు కోసం ఎన్ని వచ్చాయి? ఎన్ని సవరణలు కోరారు? ఎన్ని అభ్యంతరాలు నమోదయ్యాయి? ఎన్ని దరఖాస్తులు పరిష్కరించారు? ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయి? తిరస్కరించిన దరఖాస్తులకు కారణాలేమిటి? ఈ ప్రశ్నలకు అధికారిక గణాంకాలు సమాధానం చెప్పాలి.

ప్రజలకు సమాచారం అందుబాటులో లేకపోతే అనుమానాలు పెరుగుతాయి. రాజకీయ పార్టీలు ఆరోపణలు చేస్తాయి. అధికారులు ఖండనలు చేస్తారు. కానీ అసలు సమస్య పరిష్కారమైందా లేదా అన్నది మాత్రం తెలియని పరిస్థితి ఏర్పడుతుంది. ఈ పరిస్థితికి ముగింపు పలకాలంటే పారదర్శకత తప్పనిసరి. జాబితా సవరణ ప్రక్రియపై స్పష్టమైన నివేదికలు విడుదల చేస్తే వాస్తవాలు బయటపడతాయి. లోపాలు ఉంటే గుర్తించవచ్చు. పనితీరు సరిగా ఉంటే అధికారులపై వచ్చే నిరాధార అనుమానాలకు కూడా సమాధానం లభిస్తుంది.

ఓటరు జాబితాలో ఒక ప్రాంతంలో పేర్లు తగ్గాయని మాత్రమే చూసి అక్రమ తొలగింపులు జరిగాయని తేల్చలేం. మరణాలు, నివాస మార్పులు, ఇతర చట్టబద్ధ కారణాలు ఉండవచ్చు. అదే సమయంలో మొత్తం ఓటర్ల సంఖ్య పెరిగిందని చెప్పి అర్హులందరి పేర్లు ఉన్నాయని నిర్ధారించలేం. ప్రతి ఆరోపణను, ప్రతి గణాంకాన్ని దాని నేపథ్యంతో పరిశీలించాలి. ఆధారాలు ఉన్నప్పుడు చర్యలు తీసుకోవాలి. ఆధారాలు లేనప్పుడు ఊహాగానాలను వాస్తవాలుగా ప్రచారం చేయకూడదు.

### రాజకీయాలకు అతీతంగా ఓటరు హక్కు

ఓటరు జాబితా సమస్యను రాజకీయ లాభనష్టాల కోసం ఉపయోగించుకోవడం ప్రజాస్వామ్యానికి మేలు చేయదు. అధికారంలో ఉన్నవారు ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకూడదు. ప్రతిపక్షం ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయకూడదు. ఏ పార్టీకి లాభం కలుగుతుందనే కోణం కాకుండా, అర్హుడైన పౌరుడి హక్కు కాపాడబడిందా లేదా అన్నదే ప్రధాన ప్రశ్న కావాలి.

రాజకీయ పార్టీల బూత్ స్థాయి ఏజెంట్లు జాబితాలను పరిశీలించి, తప్పులను అధికారుల దృష్టికి తీసుకెళ్లవచ్చు. అయితే వారు తమ పార్టీకి అనుకూలమైన ఓటర్లకే ప్రాధాన్యం ఇవ్వకూడదు. ఓటు హక్కు పార్టీ సభ్యత్వం, రాజకీయ అభిప్రాయం లేదా సామాజిక నేపథ్యంపై ఆధారపడదు. చట్టబద్ధమైన అర్హతల ఆధారంగా ప్రతి పౌరుడికి సమాన అవకాశం ఉండాలి.

ఎన్నికల సంఘం నిష్పాక్షికతపై ప్రజలకు నమ్మకం కలగాలంటే దాని నిర్ణయాలు స్పష్టంగా ఉండాలి. దరఖాస్తును తిరస్కరిస్తే వర్తించే నిబంధనల ప్రకారం కారణాలు తెలియజేయాలి. అభ్యంతరాలను పరిశీలించాలి. తప్పు జరిగితే సరిచేసుకునే అవకాశం కల్పించాలి. అధికారులు తప్పులు చేయరనే భావన ప్రజాస్వామ్యానికి అవసరం లేదు; తప్పులు జరిగితే వాటిని న్యాయబద్ధంగా సరిచేసే వ్యవస్థ ఉందనే నమ్మకం అవసరం.

### యువత, వలస కార్మికులను విస్మరించవద్దు

కొత్తగా 18 ఏళ్లు నిండిన యువతలో చాలా మందికి నమోదు విధానంపై పూర్తి అవగాహన ఉండకపోవచ్చు. చదువు, ఉద్యోగం కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లేవారు తమ చిరునామా వివరాలను సవరించుకోవాల్సి రావచ్చు. వలస కార్మికులు, రోజువారీ కూలీలు, డిజిటల్ సేవలను ఉపయోగించలేని పౌరులు కూడా నమోదు ప్రక్రియలో సహాయం కోరవచ్చు.

ఇలాంటి వర్గాలకు సమాచారం చేరేలా స్థానిక స్థాయిలో చర్యలు తీసుకోవాలి. కళాశాలలు, కార్మిక నివాస ప్రాంతాలు, గ్రామాలు, పట్టణ బస్తీల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. ఆన్‌లైన్ సేవలతోపాటు ప్రత్యక్ష సహాయం కూడా అందుబాటులో ఉండాలి. దరఖాస్తు విధానం కష్టంగా ఉందని ఎవరూ తమ హక్కును వినియోగించుకోలేని పరిస్థితి ఏర్పడకూడదు.

ఎన్నికల సంఘం నిర్దేశించిన ఫారం-6 కొత్త ఓటరు నమోదుకు, ఫారం-7 అభ్యంతరాలు లేదా పేర్ల తొలగింపునకు సంబంధించిన అభ్యర్థనలకు, ఫారం-8 వివరాల సవరణ, నివాస మార్పు వంటి అవసరాలకు ఉపయోగపడతాయి. సంబంధిత పరిస్థితికి సరిపోయే దరఖాస్తును సమర్పించి, దాని స్థితిని తెలుసుకోవాలి. అధికారిక ఓటరు సేవల పోర్టల్ ద్వారా కూడా వివరాలు పరిశీలించవచ్చు. అయితే దరఖాస్తు సమర్పించడమే తుది నమోదు కాదు; దాని పరిశీలన, నిర్ణయం కూడా అవసరం.

ఓటు హక్కు ప్రభుత్వాల దయాదాక్షిణ్యం కాదు ఓటరు జాబితా సవరణను ఒక సాధారణ పరిపాలనా కార్యక్రమంగా చూడటం మానుకోవాలి. ఇది ప్రజాస్వామ్యానికి సంబంధించిన మౌలిక బాధ్యత. అర్హుల పేర్లు చేర్చడం, తప్పులను సరిచేయడం, తొలగింపులను నిబంధనల ప్రకారం నిర్వహించడం, ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించడం ఎన్నికల వ్యవస్థకు తప్పనిసరి కర్తవ్యం.

తెలంగాణలో ప్రత్యేక శిబిరాల నిర్వహణ తర్వాత వాటి ఫలితాలపై సమగ్ర వివరాలు వెల్లడించాలి. అర్హులైన పౌరుల దరఖాస్తులు పెండింగ్‌లో ఉండకుండా చూడాలి. తుది జాబితా ప్రచురణకు ముందు అందుబాటులో ఉన్న చట్టబద్ధ అవకాశాలను ప్రజలకు తెలియజేయాలి. ఓటరు జాబితాపై అనుమానాలు ఉంటే వాటిని రాజకీయ ప్రకటనలతో కాకుండా ఆధారాలు, విచారణ, అధికారిక నివేదికలతో పరిష్కరించాలి.



ఎం రవీందర్
సీనియర్ జర్నలిస్ట్
790150 3777

# రేవంత్.. చరిత్రలో నిలుస్తావా?

- - కాలగర్భంలో కలిసిపోతావా?
- జవహర్‌నగర్ డంపింగ్ యార్డుపై శాశ్వత పరిష్కారం చూపాలి
- కాలుష్యంతో ప్రజల ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి
- ఈ నెల 27 నుంచి బాధితులతో పాదయాత్ర
- ఒక్క కిలో చెత్త కూడా డంపింగ్ యార్డుకు రావొద్దు
- - మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్

తెలంగాణ బ్యూరో అక్టోబర్ 25(ప్రజాక్షేత్రం)



పాలకులకు వ్యక్తిగత కక్షలు ఉండకూడదని, పదవి గొప్పదనం కాదని.. ఆ పదవికి ఎంత న్యాయం చేస్తున్నామన్నదే ముఖ్యమని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. జవహర్‌నగర్ డంపింగ్ యార్డు కాలుష్య సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. ప్రజల సమస్యను పరిష్కరించి చరిత్రలో నిలిచిపోతావా.. కాలగర్భంలో కలిసిపోతావా తేల్చుకోవాలని వ్యాఖ్యానించారు. జవహర్‌నగర్ డంపింగ్ యార్డు కాలుష్య నియంత్రణ, బాధితుల సమస్యల పరిష్కారంపై నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశానికి ప్రొఫెసర్ మురళీ మనోహర్ అధ్యక్షత వహించారు. మేధావులు, పర్యావరణవేత్తలు, డంపింగ్ యార్డు బాధితులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ జవహర్‌నగర్ పరిసర ప్రాంతాల ప్రజలు ప్రాణాలు పోయినా పర్వాలేదన్నట్టుగా జీవించాల్సిన దుస్థితి నెలకొందన్నారు. సుమారు 30 కిలోమీటర్ల పరిధిలో కాలుష్య సమస్య తీవ్రంగా ఉందని, మహిళలకు గర్భస్రావాలు జరుగుతున్నాయని, పిల్లలు చర్మవ్యాధులతో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

### నాలుగు నెలలైనా కదలిక లేదు

జవహర్‌నగర్ ప్రజల సమస్య పరిష్కారం కోసమే తొలిసారి సీఎం రేవంత్‌రెడ్డిని కలిశానని ఈటల తెలిపారు. సమావేశం నిర్వహించాలని సీఎం సూచించడంతో చర్చలు జరిపినా, నాలుగు నెలలు గడిచినా సమస్య ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా ఉందని విమర్శించారు. రాంకీ సంస్థ డబ్బు, పలుకుబడితో కోర్టుల తీర్పులు సైతం అమలు కావడం లేదని ఆరోపించారు. సంస్థకు వచ్చే సామాజిక బాధ్యత నిధులను స్థానికంగా తాగునీరు, రహదారులు, ప్రజల అవసరాలకు ఖర్చు చేయకుండా ఇతర రాష్ట్రాల్లో వినియోగిస్తున్నారని విమర్శించారు. మరో ప్రాంతంలో చెత్త వేస్తే ప్రజలు అంగీకరించరని, అందుకే జీరో పొల్యూషన్ సాంకేతికతతో చెత్త నిర్వహణ కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఈటల సూచించారు. చెత్తను విద్యుత్, బయోగ్యాస్, సేంద్రియ ఎరువుల తయారీకి వినియోగించవచ్చని చెప్పారు. ఢిల్లీలో కోట్ల టన్నుల చెత్తను రీసైకిల్ చేస్తున్న విషయాన్ని ప్రస్తావించారు. డంపింగ్ యార్డు సమస్యను పార్లమెంట్‌లో ప్రస్తావించానని, కేంద్ర మంత్రి కట్టర్‌ను కూడా కలిశానని తెలిపారు. కేంద్రం నుంచి నిధులు తీసుకొచ్చే బాధ్యతను తాము తీసుకుంటామని పేర్కొన్నారు.

### 27 నుంచి బాధితులతో పాదయాత్ర

ఈ నెల 27 నుంచి బాధితులతో కలిసి పాదయాత్ర ప్రారంభిస్తానని ఈటల ప్రకటించారు. ప్రతి ఇంటి నుంచి ఒకరు పాల్గొనాలని ఆశిస్తున్నానని, సమస్య పరిష్కారమయ్యే వరకు రాజీపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. చెత్త ఏరుకునే వారిని కూడా రాంకీ సంస్థ అడ్డుకుంటోందని విమర్శించారు. ఒక్క కిలో చెత్త కూడా జవహర్‌నగర్‌కు రాకూడదని, ప్రస్తుతం ఉన్న చెత్తను సైతం రీసైకిల్ చేయాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై విమర్శలు చేసే క్రమంలో కేసీఆర్‌ను బోనులో పెట్టాలని చూస్తున్నారని, తెలంగాణ రైతులు, ప్రజలను ఇబ్బందుల్లోకి నెట్టవద్దని ఈటల అన్నారు. 670 టీఎంసీల నీరు కిందకు వెళ్లిపోయిందని, తెలంగాణకు 150 టీఎంసీల నీరు సరిపోయేదని వ్యాఖ్యానించారు. డంపింగ్ యార్డు కాలుష్యం 12 లక్షల కార్ల నుంచి వెలువడే కాలుష్యానికి సమానమని పేర్కొంటూ, ఈ సమస్యపై రేవంత్‌రెడ్డి రాజకీయం చేయకుండా శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు.

## జగదీష్ రెడ్డిపై వేముల వీరేశం, కుంభం నిప్పులు

**హైదరాబాద్ అక్టోబర్ 25(ప్రజాక్షేత్రం):**

జగదీష్ రెడ్డి పిచ్చి మాటలతో తెలంగాణ ప్రజలకు అబద్ధాలు చెప్పేందుకు ప్రయత్నం చేస్తున్నాడు.. జగదీష్ రెడ్డి తన మాటలతో సెల్ఫ్ గోల్ చేసుకుంటున్నాడు.. చేసిన విధ్వంసం, నష్టాన్ని కప్పిపుచ్చుకునే ఆరాటంలో జగదీష్ రెడ్డి ఉన్నాడు.. విద్యుత్ శాఖ మంత్రిగా ఏనాడైనా సమీక్ష చేశావా..? కమీషన్లు ఏరుకునే పనిలోనే జగదీష్ రెడ్డి ఉన్నాడు. మ్యాప్‌లు చూడండి శాఖలో ఏం జరుగుతుందో కనీస అవగాహన, జ్ఞానం లేని వ్యక్తి జగదీష్ రెడ్డి. నల్గొండ జిల్లాపై ఏ మాత్రం పట్టులేని, ఒక్క ప్రాజెక్టు కూడా తీసుకురాని అసమర్థ, పనికిమాలిన, పని లేని మంత్రి జగదీష్ రెడ్డి.. నల్గొండ జిల్లా ప్రజలకు శాపం జగదీష్ రెడ్డి.. యాదాద్రి పవర్ ప్లాంట్ కోసం విదేశాల నుంచి బొగ్గు దిగుమతికి ఒప్పందాలు చేసుకున్నది నిజమా కాదా..?యాదాద్రి పవర్ ప్లాంట్ అంచనాలు పెంచింది నిజమా కాదా..? ప్రతిమా గ్రూప్‌కు యాదాద్రి పవర్ ప్లాంట్‌కు బొగ్గు దిగుమతి చేసుకునే అవకాశం ఇచ్చి, యాభై ఏళ్లకు లక్ష కోట్లు ఇచ్చే ప్రయత్నం చేసింది మీరు కాదా..? ఇన్ని పాపాలు చేసి శ్రీరామచంద్రుడిలా మాట్లాడుతున్నాడు.. జగదీష్ రెడ్డి కల్లబొల్లి మాటలు మాట్లాడుతున్నాడు.. మార్కెట్‌లో తక్కువ ధరకే విద్యుత్ లభిస్తుంటే, ఎక్కువ ధరకు ఛత్తీస్‌గఢ్‌తో ఒప్పందం చేసుకున్నది మీరు కాదా..? దీని వెనుక ఆంతర్యం ఏమిటి..? లోపాయికారీ ఒప్పందాలు ఏమిటి..? ఇప్పుడు మార్కెట్‌లో విద్యుత్ కొరత ఉన్నప్పటికీ, గత ప్రభుత్వం కంటే తక్కువ ధరకే కొనుగోలు చేస్తున్నాం.. విద్యుత్ కొరత ఉన్నప్పటికీ, పంటలకు నీళ్లు ఇవ్వాలన్న ఉద్దేశంతో విద్యుత్ కొనుగోలు చేస్తున్నాం.. 20 వేల మెగావాట్ల విద్యుత్ డిమాండ్ ఉన్నా సరఫరా చేస్తున్నాం.. ఈ భారీ ఎత్తున విద్యుత్ డిమాండ్ ఉంటే ప్రభుత్వం ఇవ్వడం లేదని తప్పుడు ప్రచారం చేస్తున్నారు.. 14 వేల మెగావాట్లకు మించి గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఏనాడూ పంపిణీ చేయలేదు.. కొడంగల్‌కు జగదీష్ రెడ్డి వెళ్లి చూసి రావాలి.. మా ముఖ్యమంత్రి పైన కొడంగల్‌లో, కొండారెడ్డిపల్లిలో ఎంత ప్రేమ ఉందో నీకు తెలుస్తుంది.. సూర్యాపేట మున్సిపాలిటీలో జగదీష్ రెడ్డి ఎన్ని సీట్లు గెలిపించాడు..? జగదీష్ రెడ్డి పెద్ద మేధావిని, లీడర్ అని అనుకుంటున్నాడు.. మున్సిపాలిటీలో బీఆర్ఎస్ పార్టీని గెలిపించాడా..? నల్గొండ జిల్లా రైతులకు నీళ్లు పారిస్తే ఎందుకు బీఆర్ఎస్ పార్టీని జగదీష్ రెడ్డి గెలిపించలేదు..? సూర్యాపేటలో జగదీష్ రెడ్డి అత్తెసరు ఓట్లతోనే గెలిచాడు.. జగదీష్ రెడ్డి చిల్లర మాటలు మాట్లాడుతున్నాడు.. దొంగతనాలు బయటకు వస్తాయన్న భయంతోనే జగదీష్ రెడ్డి అడ్డగోలుగా మాట్లాడుతున్నాడు.

యాదాద్రిని పూర్తి చేసినందుకు కాంగ్రెస్ ప్రభుత్వానికి అభినందనలు తెలపకుండా ప్రభుత్వంపైన అడ్డగోలుగా మాట్లాడుతున్నావా..? సోలార్ విద్యుత్ ఉత్పత్తిని పెంచడానికి ప్రభుత్వం ప్రయత్నం చేస్తోంది.. రైతులకు సక్రమంగా విద్యుత్ పంపిణీ చేయడానికి ఆరు ఐఏఎస్ అధికారులతో నిరంతరం సమీక్ష చేయిస్తున్నాం.. గత పదేళ్లలో రాష్ట్రాన్ని సంపూర్ణంగా భ్రష్టు పట్టించారు.. దోపిడీ బయటపడుతుందన్న భయంతోనే అసెంబ్లీకి రాకుండా పారిపోయారు.. ఉద్యమకారుల ముసుగులో బీఆర్ఎస్ నాయకులు ఇంకా ఫోజులు కొడుతున్నారు.. అహంకారంతో బతుకుతున్నారు.. మీ అహంకారాన్ని బండకేసి కొట్టి అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపించారు.. తర్వాత వచ్చిన అన్ని ఎన్నికల్లో కూడా బండకేసి కొట్టారు.. అయినా అహంకార భాష పోవడం లేదు.. భవిష్యత్తులో మిమ్మల్ని తెలంగాణ ప్రజలు నమ్మరు.. ఎర్రవెల్లి ఫామ్‌హౌస్ నుంచి తెలంగాణ సమాజంపై నిరంతరం విషం చిమ్మే కుట్రలు జరుగుతూనే ఉన్నాయి.. బీఆర్ఎస్ నుంచి పాఠాలు నేర్చుకునే స్థితిలో కాంగ్రెస్ లేదు.. కాంగ్రెస్ అంటే కరెంటు.. కరెంటు అంటే కాంగ్రెస్.. ఉచిత కరెంటుకు పేటెంట్ కాంగ్రెస్..మ్యాప్‌లు చూడండి మరిన్ని కనుగొనండి టెక్నాలజీ గాడ్జెట్లు జ్యోతిష్య సేవలు సినిమాలు చూడండి బీఆర్ఎస్ హయాంలో కరువు లేకపోయినా రైతులకు సరిగా కరెంటు సరఫరా చేయలేదు.. కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సబ్‌స్టేషన్‌లో లాగ్‌బుక్ తీసి చూస్తే పారిపోయారు.. కేసీఆర్, ఆయన టీం నోరు తెరిస్తే అబద్ధాలు చెబుతున్నారు.. నిజం మాట్లాడటం వాళ్ల డీఎన్ఏలో లేదు.. అమరుల చితి మంటలపై చలికాచుకున్న చరిత్ర కల్వకుంట్ల కుటుంబానిది..పథకాలు చూడండి బీఆర్ఎస్ లాంటి పనికిమాలిన పార్టీ ప్రతిపక్షంగా ఉండటం దురదృష్టకరం.. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి ప్రతిపక్ష హోదా కూడా రాదు.. ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు కనీసం మనుషుల్లా వ్యవహరించాలి.




## గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల సమీక్ష సమావేశం..

- **రాజ్యాంగ సంస్థలపై కాంగ్రెస్ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి: రాజభూపాల్ గౌడ్**
- **నవంబర్ 6లోగా గ్రాడ్యుయేట్ ఓటరుగా నమోదు చేసుకోవాలి: నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి**

**షాద్‌నగర్:(ప్రజాక్షేత్రం):**

మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో షాద్‌నగర్‌లో నియోజకవర్గ స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి నియోజకవర్గ నాయకుడు దేపల్లి అశోక్ గౌడ్ అధ్యక్షత వహించగా, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజభూపాల్ గౌడ్, బీజేపీ రాష్ట్ర నాయకుడు, తెలంగాణ విమోచన కమిటీ కన్వీనర్ నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా రాజభూపాల్ గౌడ్ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ రాజకీయ ప్రయోజనాల కోసం ఎన్నికల సంఘం, సుప్రీంకోర్టు వంటి రాజ్యాంగ సంస్థలపై ఆరోపణలు చేస్తూ ప్రజల్లో అపోహలు సృష్టించడం సరికాదని విమర్శించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలపై ప్రజలకు నమ్మకం ఉండాలని, రాజకీయ విమర్శలు వాస్తవాల ఆధారంగా ఉండాలని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని పేర్కొంటూ, నవంబర్ 1న హైదరాబాద్‌లో నిర్వహించనున్న బీజేపీ మహాపాదయాత్రను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

తెలంగాణ విమోచన కమిటీ కన్వీనర్ నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం అర్హులైన పట్టభద్రులు నవంబర్ 6వ తేదీలోగా ఫారం18 ద్వారా ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు పట్టభద్రులకు అవగాహన కల్పించి ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ విజయానికి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో వెంకటేష్ గుప్తా, మనోహర్ రెడ్డి, భూపాల్ చారి, ఇస్నత్ శ్రీనివాస్, విఠల నరసింహ, మోహన్ సింగ్, జిల్లా ఎన్నికల సహ కన్వీనర్ ప్యాట అశోక్ ఎన్నికల సహ కన్వీనర్ లు వంశీకృష్ణ, చట్ల వెంకటేష్, ఉమా మహేశ్వరి, శ్యామ్ సుందర్, బోయ అశోక్, రాజ్ నాయక్‌తో పాటు వివిధ మండలాల అధ్యక్షులు, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల మండల కమిటీ సభ్యులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



# ప్రజాస్వామ్యానికి ప్రశ్నించే గొంతులే ప్రాణం!

- **జర్నలిస్టులపై దాడులు.. కేసుల ఒత్తిళ్లు.. నిజాన్ని రాయడమే నేరమా?**
- **ప్రజల పక్షాన నిలిచే కలానికి రక్షణ ఏది? ప్రభుత్వాలను ప్రశ్నించే మీడియాకు భరోసా ఎక్కడ?**







ప్రజాస్వామ్యంలో అధికారం ప్రజల నుంచి వస్తుంది. ఆ అధికారాన్ని ప్రజల ప్రయోజనాల కోసం వినియోగిస్తున్నారా లేదా అని ప్రశ్నించే బాధ్యత పత్రికలకు, జర్నలిస్టులకు ఉంది. ప్రభుత్వ నిర్ణయాల్లో లోపాలుంటే ఎత్తిచూపడం, ప్రజలకు ఇచ్చిన హామీలు అమలవుతున్నాయా లేదా పరిశీలించడం, అవినీతి ఆరోపణలను ఆధారాలతో వెలుగులోకి తేవడం, ప్రజల సమస్యలను పాలకుల దృష్టికి తీసుకెళ్లడం జర్నలిజం ప్రధాన లక్షణాలు. అలాంటి ప్రశ్నలే పాలకులకు అసౌకర్యంగా మారితే ప్రజాస్వామ్యానికి అంతకంటే ప్రమాదకరమైన పరిస్థితి మరొకటి ఉండదు.

తెలంగాణలో 2023 డిసెంబర్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఆంధ్రప్రదేశ్‌లో 2024 జూన్‌లో తెలుగుదేశం నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం కొలువుదీరింది. రెండు రాష్ట్రాల్లోనూ ప్రభుత్వాలు మారాయి. నాయకులు మారారు. పాలనా విధానాలు మారతాయని, ప్రజలకు మరింత స్వేచ్ఛ లభిస్తుందని, మీడియా తన బాధ్యతను స్వేచ్ఛగా నిర్వర్తించగలదని ప్రజలు ఆశించారు. కానీ అధికారంలో ఎవరున్నా జర్నలిస్టుల స్వేచ్ఛకు సంబంధించిన ప్రశ్నలు మాత్రం ఇంకా సమాధానాల కోసం ఎదురుచూస్తున్నాయి.

**తెలంగాణలో ప్రశ్నించిన జర్నలిస్టులకు ఏమైంది?**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వ పాలనలో జర్నలిస్టులపై నమోదవుతున్న కేసులు, అరెస్టులు, విమర్శనాత్మక వార్తలపై వస్తున్న అభ్యంతరాలు చర్చనీయాంశమయ్యాయి. ముఖ్యంగా 2025 మార్చిలో పల్స్ న్యూస్‌కు చెందిన ఇద్దరు మహిళా జర్నలిస్టులను ముఖ్యమంత్రిని విమర్శించే అంశంతో సంబంధం ఉన్న వీడియో ప్రచురణ వ్యవహారంలో పోలీసులు అరెస్టు చేశారు. ఆ వీడియోలో అభ్యంతరకర వ్యాఖ్యలు ఉన్నాయని పోలీసులు ఆరోపించగా, ఈ చర్యపై పాత్రికేయ స్వేచ్ఛకు సంబంధించిన సంస్థలు ఆందోళన వ్యక్తం చేశాయి. జర్నలిస్టులు బెయిల్‌పై విడుదలైనప్పటికీ, కేసు నమోదు చేయడం, అరెస్టు చేయడం వంటి చర్యలు మీడియా స్వేచ్ఛపై విస్తృత చర్చకు దారితీశాయి. అంతకుముందు 2024 ఆగస్టులో ముఖ్యమంత్రి స్వగ్రామమైన కొండారెడ్డిపల్లిలో పంట రుణమాఫీ అమలుపై సమాచార సేకరణకు వెళ్లిన ఇద్దరు మహిళా జర్నలిస్టులపై కాంగ్రెస్ కార్యకర్తలు దాడి చేశారని ఆరోపణలు వచ్చాయి. వారి కెమెరా ధ్వంసం చేశారని, ఫోన్లు లాక్కున్నారని బాధితులు ఆరోపించారు. ఈ ఘటనపై పోలీసులు కేసులు నమోదు చేసినట్లు వార్తలు వెలువడ్డాయి.

ఈ రెండు ఉదంతాలు ఒక కీలకమైన ప్రశ్నను లేవనెత్తుతున్నాయి. ప్రభుత్వం పనితీరుపై ప్రశ్నలు అడగడం, హామీల అమలును పరిశీలించడం, ప్రజల తరఫున వాస్తవాలు సేకరించడం జర్నలిస్టుల విధి కాదా? అలాంటి విధి నిర్వహణలో దాడులు ఎదురైతే బాధ్యులపై చర్యలు తీసుకోవడం ప్రభుత్వ యంత్రాంగం బాధ్యత కాదా?

ప్రభుత్వాన్ని విమర్శించే ప్రతి వార్త నిజమేనని ముందుగానే నిర్ణయించలేం. అదే విధంగా ప్రభుత్వానికి ఇబ్బందికరంగా ఉందనే కారణంతో ఏ వార్తనైనా అబద్ధమని ముద్ర వేయలేం. వార్తలో తప్పుంటే ఆధారాలతో ఖండించాలి. పరువు నష్టం జరిగితే చట్టబద్ధమైన మార్గాలున్నాయి. నేరానికి సంబంధించిన ఆధారాలుంటే చట్ట ప్రకారం దర్యాప్తు జరగాలి. కానీ విమర్శను అణచివేయడమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నారనే అనుమానం ప్రజల్లో కలిగితే అది పాలకుల విశ్వసనీయతకే నష్టం.

**ఆంధ్రప్రదేశ్‌లోనూ అదే ప్రశ్న.. అధికారం మారితే పరిస్థితి మారిందా?**

ఆంధ్రప్రదేశ్‌లో గత ప్రభుత్వ హయాంలో మీడియాపై దాడులు, జర్నలిస్టులపై కేసులు, వార్తా సంస్థల స్వేచ్ఛకు సంబంధించిన వివాదాలపై అప్పటి ప్రతిపక్ష నాయకులు, పాత్రికేయ సంఘాలు ఆందోళనలు వ్యక్తం చేశాయి. 2024 ఫిబ్రవరిలోనే అప్పటి ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు మీడియాపై దాడులు, జర్నలిస్టులపై తప్పుడు కేసులు నమోదవుతున్నాయని ఆరోపిస్తూ పోలీసు ఉన్నతాధికారులకు లేఖ రాశారు. 2024 జూన్‌లో ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ గత ఐదేళ్లలో జర్నలిస్టులపై నమోదైన కేసుల రద్దు, జీవో 2430 రద్దు వంటి డిమాండ్లను ముందుకు తెచ్చింది.

అధికారంలో లేని సమయంలో మీడియా స్వేచ్ఛ గురించి మాట్లాడటం ఒక బాధ్యత. అధికారంలోకి వచ్చిన తర్వాత అదే స్వేచ్ఛను కాపాడటం అసలు పరీక్ష. గతంలో జర్నలిస్టులపై కేసులు పెట్టడాన్ని తప్పుబట్టిన నాయకులు, ఇప్పుడు తమ పాలనలోనూ అదే తరహా ఆరోపణలు ఎదురైతే వాటిని ఎలా పరిష్కరిస్తున్నారు? దాడులకు గురైన జర్నలిస్టులకు న్యాయం జరుగుతోందా? విమర్శనాత్మక వార్తలు రాసే మీడియా సంస్థలకు సమానంగా వ్యవహరిస్తున్నారా? ఈ ప్రశ్నలకు ప్రభుత్వాల నుంచి స్పష్టమైన సమాధానాలు రావాలి.

రాజకీయ పార్టీలు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మీడియా స్వేచ్ఛ తమకు అనుకూలమైన అంశంగా మాత్రమే చూడకూడదు. అధికారంలో ఉన్నప్పుడు కూడా అదే సూత్రాన్ని పాటించాలి. నిన్నటి పాలకుల తప్పులను ఎత్తిచూపిన వారు, నేటి పాలనలో అలాంటి తప్పులు జరగకుండా చూసినప్పుడే ప్రజాస్వామ్యంపై తమ నిబద్ధతను నిరూపించుకున్నట్లవుతుంది.

**ఎన్ని దాడులు? ఎన్ని కేసులు? ప్రజలకు పూర్తి లెక్కలు కావాలి!**

తెలంగాణలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పడిన 2023 డిసెంబర్ నుంచి, ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబునాయుడు ప్రభుత్వం ఏర్పడిన 2024 జూన్ నుంచి ఇప్పటివరకు జర్నలిస్టులపై ఎన్ని భౌతిక దాడులు జరిగాయి? ఎన్ని ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి? ఎంతమందిని అరెస్టు చేశారు? ఎంతమందికి బెయిల్ లభించింది? ఎన్ని కేసుల్లో ఛార్జిషీట్లు దాఖలయ్యాయి? ఎన్ని కేసుల్లో తుది నివేదికలు సమర్పించారు? ఎన్ని కేసులు కోర్టుల్లో కొట్టివేయబడ్డాయి? ఎన్ని కేసుల్లో నిర్దోషులుగా విడుదలయ్యారు?

ఈ ప్రశ్నలకు సమాధానాలు ఊహలతో చెప్పలేం. రాజకీయ ఆరోపణలను అధికారిక గణాంకాలుగా చూపలేం. రెండు రాష్ట్రాల పోలీసు శాఖలు, హోంశాఖలు, సంబంధిత న్యాయస్థానాల రికార్డులు, పాత్రికేయ సంఘాల ధ్రువీకరించిన వివరాల ఆధారంగా సమగ్ర లెక్కలు రూపొందించాలి.

ముఖ్యంగా ఒక వ్యక్తిపై కేసు నమోదైందంటే అతను నేరస్థుడని అర్థం కాదు. కేసు నమోదు అనేది ఆరోపణపై దర్యాప్తు ప్రారంభమైన దశ మాత్రమే. అరెస్టు, ఛార్జిషీట్, విచారణ, నేర నిర్ధారణ, నిర్దోషిగా విడుదల, కేసు కొట్టివేత—ఇవన్నీ వేర్వేరు న్యాయపరమైన దశలు. వీటన్నింటినీ ఒకే లెక్కలో కలిపి ప్రచురించడం సరికాదు. అందువల్ల రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు జర్నలిస్టులపై నమోదైన కేసుల వివరాలను జిల్లా వారీగా, సంవత్సరం వారీగా, చట్టపరమైన స్థితి వారీగా ప్రజలకు అందుబాటులో ఉంచాలి. దాడులకు సంబంధించిన ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను కూడా వెల్లడించాలి. బాధితుల ఫిర్యాదులు ఎంతవరకు పరిష్కారమయ్యాయి? నిందితులపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు? అనే వివరాలను పారదర్శకంగా ప్రకటించాలి.

**నిజం రాయడం నేరమా? లేక నిజం పేరుతో దూషణా?**

జర్నలిజం అంటే అధికారంలో ఉన్నవారిని పొగడటం మాత్రమే కాదు. ప్రతిపక్షం చెప్పిందే ప్రచురించడం కూడా కాదు. వాస్తవాలను సేకరించడం, ఆధారాలను పరిశీలించడం, సంబంధిత పక్షాల వాదనలను తెలుసుకోవడం, ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని వార్తను ప్రచురించడం నిజమైన జర్నలిజం.

ప్రభుత్వ పథకాల్లో అవకతవకలున్నాయని ఆరోపణ వస్తే పత్రాలను పరిశీలించాలి. ప్రజాధనం దుర్వినియోగమైందనే అనుమానం వస్తే లెక్కలు బయటపెట్టాలి. అధికారి తప్పు చేశాడనే ఫిర్యాదు వస్తే ఆయన వివరణ కూడా తీసుకోవాలి. ఆరోపణను నిజంగా చూపకుండా, ఆధారాలు లేకుండా వ్యక్తులపై దూషణలు చేయడం కూడా పాత్రికేయ విలువలకు విరుద్ధమే.

అయితే వాస్తవాల ఆధారంగా చేసిన విమర్శను, వ్యక్తిగత కక్షతో చేసిన దూషణను ఒకే గాటన కట్టకూడదు. ప్రజా ప్రయోజనార్థం అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పకుండా జర్నలిస్టుపైనే ఎదురుదాడి చేయడం ప్రజాస్వామ్య సంప్రదాయం కాదు. అదే విధంగా విమర్శ పేరుతో తప్పుడు సమాచారాన్ని ఉద్దేశపూర్వకంగా వ్యాప్తి చేస్తే చట్టబద్ధమైన చర్యలు తీసుకోవచ్చు. కానీ ఆ చర్యలు రాజకీయ ఒత్తిళ్లకు అతీతంగా, నిష్పాక్షికంగా ఉండాలి.

**పోలీసుల పాత్ర.. అధికారానికి కాదు, చట్టానికి విధేయత**

జర్నలిస్టుపై దాడి జరిగినప్పుడు పోలీసులు తక్షణమే స్పందించాలి. ఫిర్యాదును స్వీకరించి, సాక్ష్యాలను సేకరించి, నిష్పాక్షిక దర్యాప్తు చేయాలి. బాధితుడు అధికార పార్టీకి చెందినవాడా, ప్రతిపక్షానికి చెందినవాడా, ఏ మీడియా సంస్థలో పనిచేస్తున్నాడా అనే అంశాలు న్యాయాన్ని ప్రభావితం చేయకూడదు.

అలాగే జర్నలిస్టుపై ఫిర్యాదు వచ్చినప్పుడు కూడా చట్ట ప్రకారం వ్యవహరించాలి. ఆరోపణల తీవ్రత, అందుబాటులో ఉన్న ఆధారాలు, వర్తించే చట్ట నిబంధనలు పరిశీలించాలి. అరెస్టు అవసరమా కాదా అనే అంశాన్ని చట్టపరమైన ప్రమాణాల ప్రకారం నిర్ణయించాలి. కేవలం విమర్శనాత్మక వార్త ప్రచురించారనే కారణంతోనే శిక్షించాలనే ధోరణి ఉండకూడదు.

ప్రజాస్వామ్యంలో పోలీసు వ్యవస్థ ప్రభుత్వానికి చెందినదైనా, దాని విధి రాజకీయ ప్రయోజనాలను కాపాడటం కాదు; చట్టాన్ని నిష్పాక్షికంగా అమలు చేయడం. జర్నలిస్టులపై దాడులు చేసినవారు ఎవరైనా, తగిన ఆధారాలు ఉన్నప్పుడు చర్యలు తప్పక తీసుకోవాలి. కేసులు పెట్టినవారు ఎవరైనా, అవి చట్టబద్ధమైనవా కాదా అన్నది న్యాయపరమైన పరిశీలనకు లోబడి ఉండాలి.

**పాలకులకు ఒకటే ప్రమాణం ఉండాలి**

రేవంత్‌రెడ్డి అయినా, చంద్రబాబునాయుడు అయినా, మరే ముఖ్యమంత్రి అయినా ఒక విషయాన్ని గుర్తుంచుకోవాలి: ప్రభుత్వం శాశ్వతం కాదు. పదవులు మారతాయి. పార్టీలు మారతాయి. ఎన్నికల్లో ప్రజలు తీర్పు ఇస్తారు. కానీ ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ హక్కులు, పత్రికా స్వేచ్ఛ మాత్రం ఒక ప్రభుత్వానికి మాత్రమే పరిమితమైనవి కావు.

ప్రభుత్వాన్ని విమర్శించినందుకు ఒక జర్నలిస్టును శత్రువుగా చూడటం, ప్రతిపక్షానికి అనుకూలంగా వార్త రాశాడని ముద్ర వేయడం, అధికార పార్టీకి ఇబ్బందికరమైన ప్రశ్న అడిగాడని కక్ష సాధింపులకు దిగడం ప్రజాస్వామ్యానికి మేలు చేయవు. అదే సమయంలో మీడియా సంస్థలు కూడా రాజకీయ పార్టీల ప్రచార సాధనాలుగా మారకుండా స్వతంత్రతను కాపాడుకోవాలి. పాలకులు తమపై వచ్చే విమర్శలను సహించే సంస్కృతిని పెంపొందించుకోవాలి. మీడియా తనపై వచ్చే విమర్శలను కూడా స్వీకరించాలి. తప్పు జరిగితే సరిదిద్దుకోవాలి. ఆరోపణలకు ఆధారాలు చూపాలి. ఈ పరస్పర బాధ్యతల మధ్యనే స్వేచ్ఛాయుతమైన ప్రజాస్వామ్యం బలపడుతుంది.

**కలాన్ని భయపెట్టకండి.. నిజాన్ని నిరూపించండి!**

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు జర్నలిస్టులపై దాడులు, కేసుల విషయంలో ఒకే ప్రమాణాన్ని పాటించాలి. గత ప్రభుత్వాల తప్పులను ప్రస్తావించడం మాత్రమే సరిపోదు. తమ పాలనలో అలాంటి తప్పులు జరగకుండా చర్యలు తీసుకోవాలి. జర్నలిస్టులపై నమోదైన కేసుల వివరాలను ప్రజలకు వెల్లడించాలి. నిరాధారమైన కేసులుగా తేలిన వాటి విషయంలో చట్ట ప్రకారం పరిష్కారం చూపాలి. దాడులకు పాల్పడినవారిపై నిష్పాక్షికంగా చర్యలు తీసుకోవాలి.

ప్రజాస్వామ్యానికి ప్రశ్నించే గొంతులు అవసరం. తప్పులను ఎత్తిచూపే కలం అవసరం. ప్రజల సమస్యలను అధికారానికి చేరవేసే మీడియా అవసరం. ఆ గొంతులను భయపెట్టి మౌనం చేయించడం ద్వారా ప్రభుత్వాలు తమ ప్రతిష్ఠను కాపాడుకోలేవు. పారదర్శకతతో, జవాబుదారీతనంతో, ప్రజలకు నిజాలు చెప్పడం ద్వారానే విశ్వాసాన్ని సంపాదించగలవు.

ప్రశ్నించే జర్నలిస్టును శత్రువుగా చూడకండి. అతని ప్రశ్నకు సమాధానం చెప్పండి. వార్త తప్పైతే ఆధారాలతో ఖండించండి. నేరం జరిగితే చట్ట ప్రకారం నిరూపించండి. కానీ నిజం వెలికితీసే ప్రయత్నాన్నే నేరంగా మార్చకండి. ఎందుకంటే ప్రజాస్వామ్యంలో అధికారానికి రక్షణ కవచం భయం కాదు—ప్రజల విశ్వాసం.



ఎం రవీందర్
సీనియర్ జర్నలిస్ట్
790150 3777

Printed, Published and Owner by K PRAVEEN KUMAR, Printed at MR Publications, A-20, Vambay Colony, Upparpally, Ranga Reddy (Dist), Hyderabad, Telangana 500048. Published at H.NO. 2-50 Shankar pally, Ranga Reddy. Hyderabad, Telangana 501203. Editor: KPRAVEEN KUMAR. Phone number 9177920459, email id: prajakshetram1@gmail.com, https://prajakshetram.com PRGI NO. TGTEL/25/A2394